# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - బుధవారం 12 ఆగష్టు 2026 | సంపుటి: 10 | సంచిక: 219 | పేజీలు: 8+4 | వెల రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


**2028 మార్చి దాకా ఈవీ సబ్సిడీ**




2

**ఐరాస ఆవరణలో మన నెమళ్లు**



2

# రౌడీయిజంపై ఉక్కు పాదం

## శాంతిభద్రతలపై నేడు సీఎం చంద్రబాబు సమీక్ష

## డీజీపీ నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు హాజరు

**అమరావతి, ఆగస్టు 11(మనం న్యూస్):** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మధ్యాహ్నం 03:30 గంటలకు రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నడూ లేని విధంగా పోలీస్ వ్యవస్థలోని అన్ని శ్రేణుల అధికారులను ఈ సమీక్షలో భాగస్వామ్యులను చేస్తున్నారు. డీజీపీ మొదలుకొని క్షేత్రస్థాయిలో పనిచేసే స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు మొత్తంగా 1,300 మంది అధికారులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు. శాంతి భద్రతలు, మహిళలు, చిన్నారులపై నేరాల కట్టడి, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా సైకోలు, బ్లేడ్, గంజాయి బ్యాచ్ ఆగడాలకు అడ్డుకట్ట వంటి అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించనున్నారు. పోలీస్ స్టేషన్ల పనితీరుపై ముఖ్యమంత్రి లోతైన విశ్లేషణ చేయనున్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు, శాంతిభద్రతల నిర్వహణ వంటి అంశాలపై తన వద్ద ఉన్న రిపోర్టులను ఈ సమావేశంలో నేరుగా అధికారుల ముందే ముఖ్యమంత్రి బయట పెట్టనున్నారు. రాష్ట్రంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఉక్కుపాదం మోపాలని, మహిళలు, బలహీన వర్గాల రక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి పోలీస్ ఉన్నతాధికారులు సచివాలయంలో ప్రత్యక్షంగా హాజరు కానుండగా, జిల్లాల్లోని మిగిలిన అధికారులు, ఎస్హెచ్ఓలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనబోతున్నారు.




# దేశ నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం

అభివృద్ధి అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలందరి సంయుక్త కర్తవ్యమని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా, ప్రజలను రాష్ట్ర నిర్మాణంలో భాగస్వాములను చేసే 'పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్' కార్యక్రమాన్ని ఆగస్టు 15 నుండి అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించబోతున్నట్లు సీఎం ప్రకటించారు. ప్రజలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఆగస్ట్ 15న సీఎం చంద్రబాబు శ్రీకారం

■ **పి.మీరాహుస్సేన్ ఖాన్**

**అమరావతి, (మనం ప్రత్యేక ప్రతినిధి):** ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతో పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. మంగళవారం సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ,పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజలు అంతా భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సులభంగా అందిస్తే జాతి నిర్మాణానికి సహకరించినట్టే. ప్రతి ఉద్యోగి.. ప్రతి అధికారి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు సహకరించాలనీ, పార్టనర్స్ ఇన్ నేషన్ బిల్డింగ్ అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలనీ కోరారు. దీన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. రోడ్ డాక్టర్ పేరుతో జీరో పాత్ హోల్ మిషన్ టేకప్ చేయాలి. గుంతలు పడిన రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రయోగాత్మకంగా చేస్తున్నారు. దీన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలి. ప్రభుత్వం మంచి పని చేస్తే ప్రజలు ఇన్ వాల్వ్ అవుతారనడానికి భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చిన స్పందనే నిదర్శనం. అలాగే వాస్తవాలను ప్రజలకు వివరించగలిగితే, ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తారు. దీనికి కర్నూలులో డీఎస్సీ-2025 టీచర్లు చేపట్టిన కార్యక్రమమే ప్రత్యక్ష ఉదాహరణ. నెలవారీ ఆర్థిక ప్రగతి నివేదికపై సమీక్షించాం. జూలై నెలలో 10.70 శాతం వృద్ధిని నమోదు చేయగలిగాం. ఎల్ నినో ప్రభావం ఇప్పటి నుంచి ఎక్కువగా ఉండనుంది. ఇప్పుడే అసలు సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. వీటిని అధిగమించాలి.అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎల్ నినో సంక్షోభంలోనూ.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో.. నవ్యాంధ్రలో 10.7 శాతం వృద్ధిరేటు

ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత కూడా... సిఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వ హయాంలో ప్రగతి పథంలో పయనిస్తోంది. 2025-26 రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. వ్యవసాయంలో 13.5, పరిశ్రమల్లో 10.6, సేవల రంగంలో 9.9 శాతం వృద్ధి సాధించింది.

**అమరావతి, ఆగస్టు 11(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జూలై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఏపీ వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9 శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది. సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జూలై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవా రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి. పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 9.6 శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1 శాతం వృద్ధిని సాధించాయి. సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి, అలాగే వాణిజ్య వాహనాల నమోదు

...మిగతా 2లో

## పంద్రాగస్టున జెండా పండుగను చేసుకుందాం



### హర్ ఘర్ తిరంగా ప్రచారంలో పాల్గొనాలె

### హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా అని అభివర్ణించిన ప్రధాని మోడీ

**ఢిల్లీ, ఆగస్టు 11:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్ స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళులర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోడీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని

...మిగతా 2లో

## హజ్ మొదటి విడత రుసుము చెల్లింపుకు గడువు పొడిగింపు



### 17 తేదీ వరకు పొడిగించిన కేంద్ర హజ్ కమిటీ

### మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి, ఆగస్టు11,(మనం ప్రత్యేక ప్రతినిధి):** పవిత్ర హజ్ యాత్ర -2027 కు ఎంపికైన హాజీలు యాత్ర కోసం చెల్లించాల్సిన రుసుము మొదటి విడత మొత్తం చెల్లింపు గడువు తేదీని కేంద్ర హజ్ కమిటీ పొడిగించినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు.10వ తేదీ వరకు మాత్రమే ఉన్న గడువును 17 వ తేదీ వరకు పొడిగించినట్లు మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి వెల్లడించారు. ఎంపికైన యాత్రికులందరూ అవసరమైన మొత్తాన్ని ఇప్పటివరకూ జమ చేయని పక్షంలో రూ.1,52,300 మొత్తాన్ని పొడిగించిన గడువు లోపు పూర్తి చేయాలని సూచించారు.అలాగే ఎంపికైన హజ్ యాత్రికులలో షార్ట్ హజ్ ప్యాకేజీని ఎవరైతే కోరుకున్నారో వారు తమను షార్ట్ హజ్ ప్యాకేజీ కింద పరిగణించాలని ధ్రువీకరిస్తూ, వారు కూడా పొడిగించిన గడువులోగా అవసరమైన మొత్తాన్ని జమ చేయాలని పేర్కొన్నారు. హజ్

...మిగతా 2లో

## జర్నలిస్ట్ సంఘ జాతీయ నాయకులు మీరాహుస్సేన్ ఖాన్‌కు ఘన సత్కారం

### కరోనా కాలంలో సొంత నిధులతో జర్నలిస్టులకు నిత్యవసరాలు,కూరగాయలు,కోడిగుడ్లు పంపిణీ

### అనేక సందర్భాలలో జర్నలిస్టులకు అండగా చేయూత




**హైదరాబాద్.ఆగస్టు,11,(మనం న్యూస్):** హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాజ గాన సభ వేదికలో అతిరథమహారథుల మధ్య తుర్లపాటి నాగభూషణరావు,శ్రీ దేవి దంపతులు రచించిన నేచర్ టు ఫ్యూచర్ పుస్తకావిష్కరణ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ది న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ,అసోసియేషన్ అఫ్ ప్రింట్ అండ్ బ్రాడ్ కాస్టింగ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షులు,మనం దినపత్రిక అమరావతి స్పెషల్

...మిగతా 2లో

## కలిసి పని చేద్దాం.. రండి

### మూన్ బేస్ మిషన్‌లో భాగం కావాలంటూ ఇస్రోకు నాసా ఆహ్వానం




**వాషింగ్టన్, ఆగస్టు 11:** అంతరిక్ష పరిశోధనల్లో దూసుకెళ్తున్న ఇస్రో .. చంద్రుడిపై కీలక పరిశోధనలు చేస్తున్న సంగతి విషయం తెలిసిందే. అమెరికా కూడా చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2032 నాటికి శాశ్వత మానవ స్థావరం ఏర్పాటు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ క్రమంలో ఇటీవల తలపెట్టిన మూన్ బేస్ మిషన్‌లో భాగం కావాలని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థను నాసా ఆహ్వానించింది. ఇండియా-యూఎస్

...మిగతా 2లో

## నీట్ రద్దు చేయాలి

### తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

**చెన్నై, ఆగస్టు 11:** వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడానికి జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్షను తొలినుంచీ తమిళనాడు వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం రాష్ట్ర అసెంబ్లీలో నీట్ కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. ఆరోగ్యశాఖ మంత్రి కె.అరుణ్రాజ్

...మిగతా 2లో

## తుది ఘట్టానికి చేరుకున్న వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు

- నల్లమల సాగర్‌కు రానున్న కృష్ణా జలాలు
- ఈ నెల 22 న ట్రైల్ రన్
- హర్షాతిరేకంలో ప్రజలు
- బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం, ఆగష్టు 11,(మనం న్యూస్):** జిల్లా ప్రజలు, రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా నల్లమల సాగర్ జలాశయానికి ఈ నెల 22న నీటిని విడుదల చేసేందుకు ట్రయల్ రన్ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం తాజాగా జీఓ విడుదల చేయడం వెలిగొండ ప్రాజెక్ట్ పురోగతిలో కీలక ఘట్టమని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్ కేవలం ఒక సాగునీటి ప్రాజెక్ట్ మాత్రమే కాదని, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల ప్రజలు,

...మిగతా 2లో

## నా ఓటు తీసేసిండ్రు

### తన ఓటు పోయిందంటున్న ప్రకాశ్ రాజ్



2

## పార్లమెంట్ ఆవరణలో అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ నిరసనలు

2

## 365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్ లేదా 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు

- యూట్యూబర్లకు మానిటైజేషన్ నిబంధనల్లో మార్పు

2





## ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్

**దుబాయ్, ఆగష్టు 11:** డొనాల్డ్ ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. మరోవైపు అమెరికా తమ షరతులు అంగీకరించే వరకూ

...మిగతా 2లో

## ట్రంప్ లాపతా జర్నీ

**వాసింగ్టన్, ఆగష్టు 11:** పశ్చిమాసియా ఘర్షణలు, బెదిరింపుల నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ నేతలు శత్రువులకు చిక్కకుండా కొత్తమార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ శత్రువులకు దొరక్కుండా ఒక చిన్న విమానంలో ప్రయాణించారట. పటిష్ట భద్రతకు నెలవైన ఎయిర్‌ఫోర్స్ వన్ ను వదిలి.. యూఎస్ మిలిటరీకి చెందిన చిన్న విమానాన్ని వాడారు. ఇటీవల తుర్కియేలో జరిగిన నాటో సదస్సు అనంతరం ఆ దేశాన్ని వీడేటప్పుడు ఈ రహస్య ఫ్లైట్ను ఎంచుకున్నారని అమెరికా మీడియా కథనం వెల్లడించింది. జులైలో తుర్కియే రాజధాని అంకారాలో నాటో సదస్సు జరిగింది. ఖతార్ కానుకగా ఇచ్చిన బోయింగ్ 747-8లో అంకారాకు ట్రంప్ వెళ్లారు. కానీ వచ్చేటప్పుడు మాత్రం దానిని



వాడలేదు. ఎయిర్‌ఫోర్స్ వన్ ఎక్కారు. ప్రపంచం మొత్తానికి అదే చూపించారు. కానీ అక్కడే సీన్ మారింది.. తర్వాత విమానం బెల్లీ నుంచి బయటకు తెచ్చి.. అక్కడే సిద్ధంగా

...మిగతా 2లో

## ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్‌కి అస్వస్థత

**విజయవాడ,మనం న్యూస్:** విజయవాడ ఆయుష్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆసుపత్రికి చేరుకుని హరిప్రసాద్ తో మాట్లాడి ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడారు.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఉప ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

## నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు ఆమోదం

**ఢిల్లీ, ఆగష్టు 11:** కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చేందుకు తీసుకొచ్చిన చట్ట సవరణ బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. దీంతోపాటు నేషనల్ కోఆపరేటివ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చట్టసవరణ బిల్లుకు కూడా సభ ఆమోదం లభించింది. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్కు వచ్చి సమాధానం ఇవ్వాలని సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఈ నినాదాల మధ్యే ఈ రెండు బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టగా.. ఎటువంటి చర్చ లేకుండానే మూజువాణి ఓటుతో అవి ఆమోదం పొందాయి.

# ఐరాస ఆవరణలో భారత నెమళ్లు

**జెనీవా, ఆగష్టు 11:** స్విట్జర్లాండ్‌లోని ఐక్యరాజ్యసమితి జెనీవా కార్యాలయ ప్రాంగణంలో మన నెమళ్లు సందడి చేయనున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయానికి పునరుజ్జీవం కల్పిస్తూ ఐదు నెమళ్లను జెనీవాలోని ఐరాస కార్యాలయానికి భారత్ బహూకరించింది. యుఎన్ఓజీ డైరెక్టర్ జనరల్ టాటియానా వలోవాయాకు భారత శాశ్వత ప్రతినిధి అరిందమ్ బాగ్చీ వీటిని అందజేశారు. ఇందులో నాలుగు నీలి నెమళ్లు కాగా, మరొకటి తెల్లని ఈకలతో ఉన్న మగ నెమలి. ఐక్యరాజ్యసమితికి ప్రతీకగా నిలిచే నీలం, తెలుపు రంగులను ప్రతిబింబించేలా ఈ నెమళ్లను అందించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఐరాస జెనీవా కార్యాలయానికి నెమళ్లను భారత్ బహూకరించడం ఇదే తొలిసారి కాదు. 1981లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఢిల్లీ జూ నుంచి ఒక జత నెమళ్లను పంపించారు. 45 ఏళ్ల తర్వాత ఇప్పుడు మరోసారి మన నెమళ్లు జెనీవాకు చేరాయి.

# 2028 మార్చి దాకా ఈవీ కొనుగోలు సబ్సిడీ

**పీఎం ఇ-డ్రైవ్ పథకం గడువు పొడిగింపు**

**ఢిల్లీ, ఆగష్టు 11:** ఎలక్ట్రిక్ వాహన కొనుగోలుదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పీఎం ఇ-డ్రైవ్ పథకం కింద ఇచ్చే సబ్సిడీ గడువును 2028 మార్చి 31 వరకు పొడిగించింది. ఈ పథకం అమలుకు మరో రూ.1000 కోట్లు అదనంగా కేటాయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ స్కీమ్ కింద ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు కిలోవాట్ అవర్ కు రూ.2,500 చొప్పున సబ్సిడీ చెల్లిస్తారు. ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.5వేలు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. 2024-25లో కిలోవాట్ అవర్కు రూ.5వేలు, ఒక వాహనానికి గరిష్ఠంగా రూ.10వేలు సబ్సిడీ ఉండేది. ఎలక్ట్రిక్ టూవీలర్ ఎక్స్ షోరూమ్ ధర రూ.1.5 లక్షలు దాటని వాహనాలకే ఈ సబ్సిడీ వర్తిస్తుంది. ఈ పథకం కింద మొత్తం 45,79,120 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు లబ్ధి చేకూర్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విభాగం కోసం మొత్తం రూ.2,767 కోట్లు కేటాయించారు. పీఎం ఇ-డ్రైవ్ పథకానికి రూ.11,900 కోట్లు కేటాయించింది.దేశంలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచే ఉద్దేశంలో పీఎం ఇ-డ్రైవ్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. 2024 సెప్టెంబర్లో ప్రకటించిన ఈ పథకం గడువు 2027 మార్చి 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సబ్సిడీ గడువు పొడిగించాలంటూ రాజ్యసభ స్టాండింగ్ కమిటీ కేంద్ర భారీ పరిశ్రమల శాఖను కోరింది. ఈ క్రమంలో గడువు పెంపు నిర్ణయం వెలువడింది. నిర్దేశిత గడువు కంటే ముందే ఈ నిధులు పూర్తయితే కొత్త క్లెయిమ్లు స్వీకరించరు. అలాగే, ఇ-ద్విచక్ర వాహనాల సబ్సిడీ క్లెయిమ్ చేసుకోవడానికి 2027 డిసెంబర్ 31ని చివరితేదీగా నిర్ణయించారు.

# ట్రంప్ పదవీకాలం పూర్తయ్యేదాకా చర్చల ప్రసక్తే లేదు: ఇరాన్

(మొదటి పేజీ తరువాయి)

హర్మూజ్ జల సంధిని తెరిచే ప్రసక్తి లేదని ఇరాన్ విదేశాంగశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయి తెలిపారు. రేవుల దిగ్బంధనాన్ని ఎత్తివేయడంతోపాటు యుద్ధంవల్ల ఇరాన్‌కు కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయాలని, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల్ని విడుదల చేయాలని బఘేయి డిమాండు చేశారు.

మీరే పరిహారం చెల్లించాలి: ట్రంప్

గత ఐదు నెలలుగా యుద్ధంవల్ల కలిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని ఇరాన్ కోరుతోందని, అది మంచి ఐడియానే అని, అయితే చాలా ఏళ్లుగా చేస్తున్న అరాచకాలకు ఆ దేశం పరిహారం చెల్లించాల్సి ఉంటుందని ట్రంప్ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇరాన్ అరాచకాలు చేస్తోందని, ఆందోళనల సందర్భంగా వేల మందిని చంపిందని, గత ఐదు నెలల్లో చంపిన 52,000 మందికీ పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు.

# ఎల్ నినో సంక్షోభంలోనూ.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో.. నవ్యాంధ్రలో 10.7 శాతం వృద్ధిరేటు

(మొదటి పేజీ తరువాయి)

51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో జీఎస్టీ పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ. 2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్ తో 75.4 శాతం మేర, రూ. 60 వేల కోట్ల మేర ఎంఎస్ఎంఈ రంగ పెట్టుబడులు 73.6 వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

**ఎల్ నినో సంక్షోభంలో లక్ష్యాల్ని సాధించాలి**

ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సీఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని.. గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని సీఎం పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని.. ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు.

నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని దీనిపై ఓ కమిటీ వేయాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఏపీ 15 శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సిన ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సీఎం సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు హాజరయ్యారు.

# హజ్ మొదటి విడత రుసుము చెల్లింపుకు గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

యాత్రకు వెళ్లే హాజీలంతా క్రెడిట్ కార్డ్/డెబిట్ కార్డ్/నెట్ బ్యాంకింగ్ ఉపయోగించి https://hajcommittee.gov.in లేదా హజ్ సువిధా యాప్లో అందుబాటులో ఉన్న ఇ-చెల్లింపు సౌకర్యం ద్వారా మొత్తాన్ని చెల్లించవచ్చన్నారు. ప్రతి కవర్ నంబర్కు ఎదురుగా హజ్ కమిటీ ఆఫ్ ఇండియా వెబ్సైట్లో అందుబాటులో ఉన్న బ్యాంక్ రిఫరెన్స్ నంబర్ను ఉపయోగించి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏదైనా శాఖల లో హజ్ కమిటీ ఆఫ్ ఇండియా ఖాతాలో నిర్దేశించిన పే-ఇన్-స్లిప్ ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. ప్రతి కవర్కు అందించిన ప్రత్యేకమైన బ్యాంక్ రిఫరెన్స్ నంబర్ను డిపాజిట్లో తప్పనిసరిగా పేర్కొనాలన్నారు. ఈ నెల 17తేదీ లోపు అవసరమైన మొత్తాన్ని డిపాజిట్ చేయడంలో విఫలమైన ఎంపికైన యాత్రికులందరి హజ్ సీట్లు, ఎటువంటి తదుపరి నోటీసు లేకుండా రద్దు చేయబడతాయని కేంద్ర హజ్ కమిటీ హాజీలందరికీ తెలియజేయడం జరిగిందని మంత్రి ఫరూక్ తెలిపారు.

వచ్చే ఏడాది హజ్ యాత్ర కోసం 2830 మంది యాత్రికులు ఏపీ నుంచి దరఖాస్తు చేసుకోగా,2792 మంది ఎంపికయ్యారని, వీరిలో 460 మంది షార్ట్ హజ్ కు దరఖాస్తు చేసుకున్న విషయాన్ని మంత్రి మరోసారి గుర్తు చేశారు. విజయవాడ ఏంబార్కేషన్ కేంద్రం నుంచి హజ్ కు వెళ్లేందుకు 637 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. విజయవాడ ఎంచుకున్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.లక్ష ఆర్థిక సాయంతో పాటు వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను, ఏర్పాట్ల ను పగడ్బందీగా చేసేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసిందని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు.



## అమెరికాలో ఇమిగ్రేషన్ అప్లికేషన్ ఆన్‌లైన్ ఫైలింగ్ తప్పనిసరి

**వాషింగ్టన్, ఆగష్టు 11 :** వలసలను అరికట్టేలా ఇప్పటికే ఉన్న అన్ని విధానాలను అమెరికా ప్రభుత్వం కఠినతరం చేస్తోంది. గ్రీన్‌కార్డ్, పౌరసత్వం, ఆశ్రయం వంటి ప్రయోజనాలు పొందేందుకు వలసదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడాన్ని తప్పనిసరి చేయనుంది. త్వరితగతిన మెరుగైన సేవలు అందించేందుకు, నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు యూఎస్ సిటిజన్షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ ఈ కొత్త నిబంధనను తీసుకువచ్చింది. ఈ మేరకు కొత్త నిబంధనను ఫెడరల్ రిజిస్టర్‌లో సోమవారం పబ్లిష్ చేసింది. గ్రీన్‌కార్డు దరఖాస్తులు, రెన్యువల్స్, ఫ్యామిలీ బేస్డ్ పిటిషన్లు, పౌరసత్వం కోసం, ఆశ్రయం కోసం చేసుకునే అభ్యర్థనలు, ఉపాధి అనుమతి దరఖాస్తులు, తాత్కాలిక రక్షిత హోదా ప్రయోజనాలు పొందేందుకు వలసదారులు ఈ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మామూలుగా అయితే దరఖాస్తు దారులు యూఎస్సీఐఎస్ ఆన్‌లైన్ అకౌంట్ లేదా మెయిల్ (పోస్టు) ద్వారా పంపించే అవకాశం ఉంది.

# తుది ఘట్టానికి చేరుకున్న వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణ పనులు

(మొదటి పేజీ తరువాయి)

రైతుల దశాబ్దాల కలకు ప్రతీక అని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు. కరువు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి అండగా నిలిచి, ఈ ప్రాంతాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి వెలిగొండ ప్రాజెక్ట్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జలవనరుల అభివృద్ధి, సాగునీటి మౌలిక వసతులకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. నీటి భద్రత, రైతుల సంక్షేమం, సాగునీటి వసతుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు దేశ అభివృద్ధికి కొత్త దిశను చూపిస్తున్నాయని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్లోనూ కీలక సాగునీటి ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ ఏలూరి తెలిపారు. పెండింగ్లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేసి, రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపడుతోందన్నారు.

ప్రత్యేకంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చొరవ, పర్యవేక్షణతో వెలిగొండ ప్రాజెక్టు సంబంధించిన పనులు, నీటి విడుదలకు అవసరమైన చర్యలు వేగవంతమవుతున్నాయని చెప్పారు. నల్లమల సాగర్కు నీటి విడుదల కోసం ఈ నెల 22న నిర్వహించనున్న ట్రయల్ రన్ అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ నెల 22న జరగనున్న ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయితే వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా నీటి ప్రవాహం మరింత ముందుకు సాగి, రైతుల పొలాలకు సాగునీరు అందించే లక్ష్యం మరింత చేరువ అవుతుందని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. నల్లమల ప్రాంతంతో పాటు కరువు ప్రభావిత ప్రాంతాలకు తాగునీటి భద్రత కల్పించడంలోనూ ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రధాని మోదీ అభివృద్ధి దార్శనికత.. ఎన్డిఏ కూటమి ప్రభుత్వ సంకల్పం.. సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వం.. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారి కృషి.. వెలిగొండ ప్రాజెక్టు కొత్త ఊపునిస్తున్నాయని డాక్టర్ ఏలూరి పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ పూర్తితో రైతులకు సాగునీటి భరోసా, ప్రజలకు తాగునీటి భద్రత, మార్కాపురం జిల్లా అభివృద్ధికి కొత్త దిశ లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నల్లమల ప్రాంతం సస్యశ్యామలం కావాలన్న ప్రజల చిరకాల ఆకాంక్ష త్వరలో సాకారం కావాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరుకున్నారు.

# నీట్ రద్దు చేయాలి

**తమిళనాడు అసెంబ్లీ తీర్మానం**

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఈ తీర్మానాన్ని తీసుకువచ్చారు. దీనికి ప్రధాన విపక్షాలైన డీఎంకే, ఏఐఏడీఎంకే మద్దతు తెలిపాయి.

టీవీకేకు మిత్రపక్షాల నుంచి ఎలాగూ మద్దతు ఉంది. ఒక్క బీజేపీ మాత్రం సభ నుంచి వాకౌట్ చేసింది. తీర్మానాన్ని ప్రవేశపెట్టిన సందర్భంగా ఆరోగ్య మంత్రి అరుణ్రాజ్ మాట్లాడారు. ''కేంద్ర ప్రభుత్వం నీట్‌ను రద్దు చేయాలి. ఈ ప్రవేశ పరీక్షవల్ల విద్యార్థుల దృష్టి కోచింగ్ సెంటర్ల వైపు మళ్లింది. ఫీజులు భారీగా వసూలు చేసే కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని, సామాజికంగా-ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల అవకాశాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి' అని ఆందోళన వ్యక్తంచేశారు. సామాజిక న్యాయం, సమానత్వం, రాష్ట్రాల హక్కులకు ఈ పరీక్ష వ్యతిరేకం అనే విషయాన్ని తమిళనాడులోని ప్రతి ప్రభుత్వం వాదిస్తోన్న విషయాన్ని గుర్తుచేశారు. 12వ తరగతి మార్కుల ఆధారంగా వైద్య కోర్సుల్లో ప్రవేశం ఉండాలని విజయ్ (టీవీకే) ప్రభుత్వం ప్రతిపాదించింది. గతంలో డీఎంకే ఇదే ప్రతిపాదన చేసిన సంగతి తెలిసిందే.

నీట్ పేపర్ లీక్ అంశాన్ని కూడా తమిళనాడు ప్రభుత్వం తీర్మానంలో ప్రస్తావించింది. విద్యార్థుల ఆత్మహత్యలకు ఈ పరీక్ష ఒత్తిడి కారణమని పేర్కొంది. నీట్ రద్దుతోనే వాటికి ముగింపు వస్తుందని అభిప్రాయపడింది.

# ట్రంప్ లాపతా జర్నీ

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న ఎయిర్పోర్ట్ క్యాటరింగ్ ట్రక్కు లోకి ట్రంపును మార్చారు. ఆ తర్వాత ఆయన్ను ఇ-32అ విమానంలోకి ఎక్కించి రహస్యంగా తుర్కియే దాటించారు. అక్కడి నుంచి బ్రిటన్ వెళ్లారు. ఎయిర్ఫోర్స్ వన్లో పాత్రికేయులు, ఇతర సిబ్బంది ప్రయాణించారు. ట్రంప్ ఆ విమానంలోనే ఉన్నారని శత్రువులను నమ్మించేందుకు, ఆయన భద్రత దృష్ట్యా ఈ ఏర్పాటు చేశారని తెలుస్తోంది. జులై 8న ఈ ఘటన జరిగిందని మీడియా కథనం పేర్కొంది. అప్పటికే ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి. అదీగాక తుర్కియేకు అత్యంత సమీపంలో ఇరాన్ ఉంటుంది.

## పంద్రాగస్టున జెండా పండుగను చేసుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోడీ పేర్కొన్నారు.

# జర్నలిస్ట్ సంఘ జాతీయ నాయకులు మీరాహుస్సేన్ ఖాన్‌కు ఘన సత్కారం

(మొదటి పేజీ తరువాయి)

కరెస్పాండెంట్ పి.మీరాహుస్సేన్ ఖాన్ ను తుర్లపాటి నాగభూషణరావు,శ్రీదేవి దంపతులు ఘనంగా అత్మీయంగా సత్కరించారు.కరోనా సమయంలో సుమారు 10లక్షలకు పైగా ఖర్చు చేసి ,విజయవాడ,నందిగామ,వీరులపాడు లో జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు, కురగాయాలు అందజేశారని, అంతేకాకుండా నందిగామలో సుమారు 150మంది పారిశుద్ధ్య కార్మికులకు కూరగాయలు ,కోడిగుడ్డు ,సచ్చివాలయ సిబ్బందికి కూరగాయలు, కోడిగుడ్డు అందజేశారని, మీరాహుస్సేన్ సేవలు అభినందనీయమని, జర్నలిస్ట్ సంఘం ద్వారా జర్నలిస్ట్ ల సంక్షేమానికి, అభ్యున్నతి, కష్టసమయల్లో నేనున్నానంటు చేతనైనంత సొంత నిధులు అందిస్తు,తోటి వారి సహాకారంతో పలువురు జర్నలిస్టులను అదుకోవడం, భరోసా కల్పించి సహాయం చేయడం పలువురికి ఆదర్శమని తుర్లపాటి వివరించారు, అనంతరం జర్నలిస్ట్ సంఘ జాతీయ నాయకులు మీరాహుస్సేన్ ఖాన్ తుర్లపాటి నాగభూషణరావు,శ్రీదేవి దంపతులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు అన్నవరపు చంద్రశేఖర్, పంగులూరు వెంకట్రావు చౌదరి, శివరామకృష్ణా, మైనార్టీ నాయకులు ఎస్.ఎం రబ్బానీ.నరేంద్ర నాయక్, పెసరమల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్యులకు లంచాలు..

**అమెరికాలో భారత సంతతి వ్యక్తికి జైలు**

**మసాచుసెట్, ఆగష్టు 11 :** భారత సంతతికి చెందిన వ్యక్తికి అమెరికా ఫెడరల్ కోర్టు నాలుగు నెలల జైలు శిక్ష.. 9,500 డాలర్ల జరిమానా విధించింది. వెన్నెముక శస్త్రచికిత్సల్లో తమ సంస్థ పరికరాలను వినియోగించేలా వైద్యులకు లంచాలు ఇచ్చిన కేసులో ఈ తీర్పునిచ్చింది. జైలు శిక్ష పూర్తికాగానే ఏడాది పాటు అధికారుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపింది. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్‌కు చెందిన ఆదిత్య హుమద్ వైద్యులకు లంచాలు ఇచ్చేందుకు కుట్ర పన్నినట్లు గతంలో నేరాన్ని అంగీకరించారు. స్పైన్ ఫ్రంటియర్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ కింగ్స్‌లే చిన్‌తో కలిసి ఆయనపై 2021 సెప్టెంబరులో కేసు నమోదైంది. హుమద్ ఆ కంపెనీలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పనిచేశారు. వారి సంస్థకు చెందిన వెన్నెముక పరికరాలను శస్త్రచికిత్సల్లో ఉపయోగించేలా వైద్యులను ప్రలోభపెట్టినట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. ఈ వ్యవహారంలో హుమద్, ఆయన సంస్థలు, లంచాలు తీసుకున్న వైద్యుల నుంచి ఇప్పటివరకు రూ.40 లక్షల డాలర్లకు పైగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది.

# నా ఓటు తీసేసిండ్రు


**తన ఓటు పోయిందంటున్న ప్రకాశ్ రాజ్**

**బెంగళూరు, ఆగష్టు 11:** బెంగళూర్లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై మాట్లాడారు. 'సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారు' అని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు.

ప్రకాశ్ రాజ్ కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది. నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ కేసులో జులైలో బెంగళూరు కోర్టు ముందు ప్రకాశ్ రాజ్ హాజరుకాగా.. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ నిరసనలు

**ఢిల్లీ, ఆగష్టు 11 :** అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఢిల్లీలో నిరసనకారులపై పోలీసుల దాడి గురించి హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్లో మాట్లాడాలని.. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు ఝార్ఖండ్లో విద్యార్థులపై పోలీసుల లాఠీ ఛార్జీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడాలని భాజపా ఎంపీలు నినాదాలు చేశారు. దిల్లీ విషయంలో మీడియాలో చర్చలు జరిపిన రాహుల్ ఝార్ఖండ్ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. మరోవైపు లోక్సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. ప్రతిపక్షాల



నినాదాల మధ్య సభ రేపటికి వాయిదా పడింది వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్గాంధీ మెలిక పెట్టారు.

# కలిసి పని చేద్దాం రండి

(మొదటి పేజీ తరువాయి)

సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశం బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఇటీవల జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటికే చేసుకున్న ఒప్పందాలను మరింత బలోపేతం చేసుకోవడం, శాస్త్రీయ సమాచారాన్ని పంచుకోవడం, సహకారం, వీటికి సంబంధించిన చర్చలను ముమ్మరం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. గతేడాది అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత ప్రధాని మోడీ చేసిన సంయుక్త ప్రకటనకు అనుగుణంగా ఇరు దేశాలు సాధారణ, వాణిజ్య




అంతరిక్ష పరిశోధనల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవడంపైనా ఇరు పక్షాలు ప్రధానంగా దృష్టి సారించాయి. ఈ సందర్భంగా ఇస్రో ఛైర్మన్ నారాయణన్, అమెరికా రాయబారి సెర్గియో గోర్లు మాట్లాడుతూ.. ద్వైపాక్షిక అంతరిక్ష సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం, దాని ప్రాముఖ్యతను ప్రస్తావించారు.

# 365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్

**యూట్యూబర్లకు మానిటైజేషన్ నిబంధనల్లో మార్పు**




**హైదరాబాద్, ఆగష్టు 11 :** కొత్త యూట్యూబర్లకు కష్టకాలం వచ్చింది. మానిటైజేషన్కు అవసరమైన వాచ్టైమ్ను ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్ఫాం యూట్యూబ్ రెట్టింపు చేసింది. క్రియేటర్లు వీడియోల ద్వారా డబ్బు సంపాదించడానికి వీలు కల్పించే యూట్యూబ్ పార్ట్ నర్ ప్రోగ్రామ్‌లో చేపట్టిన మార్పుల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. ఇంతకు ముందు.. డబ్బు సంపాదించాలంటే కంటెంట్ క్రియేటర్లుకు గత 365 రోజుల్లో 4,000 వాచ్ అవర్స్ లేదా 10 మిలియన్ షార్ట్స్ వ్యూస్ ఉండాలి. అయితే.. కొత్త నిబంధనల ప్రకారం గత 365 రోజుల్లో 8,000 క్వాలిఫైడ్ వాచ్ అవర్స్ లేదా గత 90 రోజుల్లో 20 మిలియన్ల షార్ట్స్ వీక్షణలు ఉండాలి. 1,000 మంది సబ్ స్క్రైబర్లు ఉండాలనే నియమంలో మాత్రం ఎటువంటి మార్పు లేదని తెలిపింది. అయితే ఇప్పటికే యూట్యూబ్ పార్ట్నర్ ప్రోగ్రామ్‌లో ఉన్న క్రియేటర్లపై ఈ ప్రభావం ఉండబోదని పేర్కొంది. ప్రోగ్రామ్లో ఇప్పటికే 3 మిలియన్లకు పైగా కంటెంట్ క్రియేటర్లు ఉన్నారు. ఈ నిబంధనలు 2027 ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి రానున్నట్లు యూట్యూబ్ వెల్లడించింది. యూట్యూబ్ షార్ట్స్ ద్వారా వచ్చే ఆదాయం కోసం కూడా ఈ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్ఫాం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. వీటి ద్వారా ప్రకటనలు, సబ్స్క్రిప్షన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచుకోవడానికి అర్హత పొందాలంటే క్రియేటర్లు 90రోజుల వ్యవధిలో 10 మిలియన్ల షార్ట్స్ వ్యూస్ కలిగి ఉండాలి. ఈ నిబంధన కొత్త క్రియేటర్లతో పాటు ఇప్పటికే ఉన్నవారికి కూడా వర్తిస్తుంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1నుంచి ఇది అమల్లోకి వస్తుంది.



## ఆగస్టు 23 నుండి 25వ తేదీ వరకు శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

**తిరుమల,ఆగస్ట్ 11 మనం న్యూస్:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆగస్టు 23 నుంచి 25వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఆగస్టు 22వ తేదిన అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో యాత్రికుల వల్లగానీ, సిబ్బంది వల్లగానీ తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయి. వీటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్లు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది.

# శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితుల అరెస్ట్

- శ్రీకాళహస్తిలో సంచలనం రేకెత్తించిన హత్య కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు
- -తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒక నిందితుడు అరెస్ట్



**తిరుపతి ఆగష్టు 11మనం న్యూస్:** హత్య ఘటన వివరాలను ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు వెల్లడించారు.

ఆగస్టు 2వతేది రాత్రి సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలోని పిఆర్ గెస్ట్ హౌస్ సమీపంలోని స్వర్ణముఖి నది కట్టపై శ్రీకాళహస్తికి చెందిన మగలంపాటి శివకుమార్ అలియాస్ శివను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో తలపై, శరీరంపై దాడి చేసి హత్య చేసిన ఘటనపై శ్రీకాళహస్తి ఒన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో జరిగిన ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించిన తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు., కేసును ప్రత్యేకంగా అదనపు ఎస్పీ రవి మనోహరాచారి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి ఒన్ టౌన్, టు టౌన్, రూరల్, బి.ఎన్. కండ్రిగ పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక దర్యాప్తు బృందాలు వివిధ సాంకేతిక ఆధారాలను సేకరించి, వాటిని విశ్లేషించి ముద్దాయిలు వి. కార్తీక్, వి. గోపీనాథ్ అలియాస్ గుండు గోపి,బి. శ్రీధర్ అలియాస్ రెడ్డి అను వార్లు శ్రీకాళహస్తికి వచ్చి శివకుమార్ ను కత్తులతో నరికి చంపినట్లుగా,యం. సూర్య అను వ్యక్తి తమిళనాడు రాష్ట్రంకు చెందిన మరొక ముద్దాయి శివకుమార్ ను చంపడానికి అవసరమై, కత్తులను సమకూర్చినట్లు దర్యాప్తులో తెలిసినది. పుత్తూరుకు చెందిన మునస్వామిసూర్య, తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు హత్యకు అవసరమైన కత్తులను, మోటార్ సైకిల్ ను సమకూర్చడంలో సహకరించినట్లు గుర్తించారు.

తమిళనాడు పోలీసులకు కావలసిన నేరస్థుడు తొప్పై గణేషన్ కు, చంపబడిన శివకుమార్ అలియాస్ శివ శ్రీకాళహస్తి లో ఆశ్రయం కల్పించినాడని, ఆ తరువాత గణేష్ మార్చి16వ తేదీన చెన్నైలో పోలీస్ కాల్పులలో మరణించినాడని, అందుకు శివకుమార్ చెన్నై పోలీసు వారికి సమాచారం ఇచ్చినందు వల్లనే, తమిళనాడు పోలీస్ కాల్పులలో చనిపోయాడని అనుమానంతో కక్ష పెంచుకొని, అరెస్టు కాబడిన ముద్దాయిలు ప్రతీకార చర్యగా శివకుమార న హత్య చేయడం జరిగినది.

అరెస్ట్ వివరాలు.దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు నలుగురు నిందితులను ఈ దినము అనగా ఆగస్టు 11న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన యమహా ఖ15 మోట్సాకిల్, రెండు కత్తులు, రెండు సెల్ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.



## ఖాకీ డ్రస్ వేసుకుంటే.. అరెస్టు చేస్తారా..?

**చంద్రగిరి ఆగస్టు 11 మనం న్యూస్:** ''ఖాకీ చొక్కా వేసుకున్నంత మాత్రాన ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందిని అరెస్టు చేస్తారా..? అలాగైతే పంచాయతీ కార్మికులు, ఆటో డ్రైవర్లు, పరిశ్రమల్లో పనిచేసే కూలీలను కూడా అరెస్టు చేయాలి. తమ విధుల్లో భాగంగా ఖాకీ రంగును పోలిన యూనిఫాం ధరించిన ప్రయివేటు సెక్యూరిటీపై ప్రతాపం చూపుతారా..? చంద్రగిరిలో జరిగిన నిరసన ర్యాలీ విజయవంతమైందనే అక్కసుతో పోలీసులను ముందు పెట్టి ప్రభుత్వం కక్ష తీర్చుకుంటోంది'' అని రాష్ట్ర వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్రెడ్డి ఆరోపించారు.

చంద్రగిరి వైఎస్సార్సీపీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 10న డీఎస్పీ అక్రమాలపై నిర్వహించిన నిరసన ర్యాలీకి వేలాది మంది తరలి వచ్చారు. ర్యాలీలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రక్షణ చర్యల్లో భాగంగా ప్రయివేటు సెక్యూరిటీని ఏర్పాటు చేసుకుంటే అది తప్పా..? ర్యాలీ ముగిసిన అనంతరం సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరిద్దరు ఖాకీ రంగు దుస్తులు ధరించారని పోలీసులు అర్ధరాత్రి వారి ఇళ్లకు వెళ్లి తీసుకొచ్చి నిర్బంధించడం కక్ష సాధింపులో భాగం కాదా..? అంటూ వైఎస్ఆర్సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు సెక్యూరిటీ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న హర్షిత్రెడ్డి మంగళ వారం చంద్రగిరి పోలీస్స్టేషన్ ముందు శాంతియుత నిరసన చేపట్టారు. ఆయనకు మద్దతుగా నియోజకవర్గంలోని పార్టీ నేతలు, విద్యార్థి విభాగం నాయకులు అక్కడికి చేరుకున్నారు. సీఐ సురేష్కుమార్ నిరసనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా.. ప్రయివేటు సెక్యూరిటీని ఎందుకు అరెస్టు చేశారని హర్షిత్రెడ్డి ప్రశ్నించారు. విచారణకు తీసుకొచ్చామే తప్ప అరెస్టు చేయలేదన్న సీఐ.. ఆ తరువాత కొంత సేపటికే కేసు పెట్టినా విచారించి పంపిస్తామని చెప్పడంతో సెక్యూరిటీ సిబ్బందిని విడుదల చేసే వరకు కదిలేది లేదంటూ హర్షిత్రెడ్డి స్టేషన్ ముందు బైఠాయించారు.

# ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి!



**చంద్రగిరి ఆగస్టు 11 మనంన్యూస్ :** చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి మండలం ఇందరమ్మ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మార్పు కోసం పల్లెబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది .కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, 2006 సంవత్సరంలో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేయగా ఇంతవరకు డ్రైనేజీ కాలవలు లేనందున డ్రైనేజీ వాటర్ పూర్తిగా రోడ్లు పైకి వచ్చి ప్రజలకు ఇబ్బంది కరంగా ఉన్నది. దీనివలన ఇక్కడ నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు పాలవుతున్నారు. 1000 ఇండ్లు ఉన్న ఇందిరమ్మ కాలనీలో పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణం లేదు, డ్రైనేజి కాలవలు లేవు, అంగన్వాడి స్కూలు లేదు, మౌలిక సదుపాయాలు కల్పించలేదు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఇంతవరకు లేవు, వితంతు పెన్షన్లు 60 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ సౌకర్యాలు దాదాపు 20శాతం మందికి పైగా లేవని పల్లెబాట కార్యక్రమంలో గుర్తించడం జరిగింది.

# తిరుపతి జిల్లాకు 16 వాహనాలు కేటాయింపు

- వాహనాలను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**తిరుపతి, ఆగష్టు 11 మనం న్యూస్:** గర్భిణులు, బాలింతలకు సురక్షితమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ఆసుపత్రికి సకాలంలో చేర్చేందుకు, ప్రసవానంతరం తల్లి-బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం '102 తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్' వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా '102 తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్' వాహనాల ప్రారంభ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో తిరుపతి జిల్లాకు కేటాయించిన 16 తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనాలను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, ఏపీ యాదవ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు కలిసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేసులు, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు ఈ సేవలను ప్రత్యేకంగా వినియోగించుకోవాలని సూచించారు.

గర్భిణులకు అవసరమైన యాంటీనేటల్ చెకప్లు, సంబంధిత వైద్య పరీక్షలు, వైద్యుల సూచన మేరకు ఐరన్ సుక్రోజ్ వంటి చికిత్సలు పొందేందుకు ఆసుపత్రులకు వెళ్లి రావడానికి 'తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్' సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చేందుకు కూడా ఈ వాహనాలను వినియోగించుకోవచ్చని వివరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం పొందిన మహిళలు, గర్భిణులు ఈ ఉచిత రవాణా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత ప్రభుత్వ వైద్యాధికారి, ఏఎన్ఎం లేదా ఆశా కార్యకర్త ద్వారా 102 నంబర్కు ఫోన్ చేసి 'తల్లి బిడ్డ ఎక్స్ప్రెస్' సేవలను బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# నేతన్నల సంక్షేమం పేరుతో 'నేతన్నల సేవలో' గందరగోళం!



**మదనపల్లె ఆగష్టు 11మనం న్యూస్:** చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 'నేతన్నల సేవలో' పథకం అన్నమయ్య జిల్లాలో పారదర్శకతకు దూరంగా సాగుతోందని, పథకం అమలులో అనేక అవకతవకలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ తీవ్రంగా విమర్శించారు. జి.ఒ.ఎంఎస్ నెం.187, జులై 29, 2026 ద్వారా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేస్తున్నారో ప్రభుత్వం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.మదనపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చేనేత సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతూ.. చేనేత కార్మికుల జీవితాలతో ప్రయోగాలు చేయడం, సంక్షేమ పథకాల పేరుతో అర్హులైన నేతన్నలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని మండిపడ్డారు. స్థానిక కూటమి నాయకులు ఒక్కొక్క లబ్దిదారుని నుంచి 5000/- నుండి 12000/- రూపాయలు వసూలు చేశారని వారి కనుసన్నలలోనే ఎంపిక జరిగిందని, అసలైన లబ్ధిదారులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు.

జిఒ ఎంఎస్ నెం187 ద్వారా పథకం అమలుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేసే విధానంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఎవరు అర్హులు?

ఎవరు అనర్హులు?లబ్ధిదారులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు?ఎవరు క్షేత్రస్థాయిలో పరిశీలించారు?

ఎవరు తుది ఆమోదం ఇచ్చారు? ఈ ప్రశ్నలకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శీలం రమేశ్ మాట్లాడుతూ అర్హత ఉన్న నిజమైన నేతన్నల వివరాలను పారదర్శకంగా పరిశీలించకుండా, రాజకీయ పలుకుబడి ఉన్నవారికి లేదా ప్రభావవంతమైన వ్యక్తులకు ప్రయోజనాలు కల్పిస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ డా., ఎస్. వెంకటేశ్వర్




**తిరుపతి, ఆగష్టు 11 మనం న్యూస్:** రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడ్డాపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పోర్ట్ పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు చెన్నై నేషనల్ హైవే పి డి లు, వెంకటేశ్వర్లు, రమేష్,రవీందర్రావు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ రాజా నాయక్, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు

- తల్లీ బిడ్డా ఎక్స్ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది
- జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు ఆగస్టు 11మనం న్యూస్:** ప్రసూతి, శిశు మరణాలను మరింతగా తగ్గించడంతో పాటు గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తల్లీ బిడ్డా ఎక్స్ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు.మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన తల్లీ బిడ్డా ఎక్స్ప్రెస్ వాహనాల ప్రారంభ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొని వాహనాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రసూతి మరణాలు, శిశు మరణాలను తగ్గించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలో ఉన్న రవాణా సౌకర్యాల లోటును భర్తీ చేస్తూ పాత వాహనాల స్థానంలో కొత్త వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.జిల్లాకు సుమారు 11 తల్లీ బిడ్డా ఎక్స్ప్రెస్ వాహనాలు కేటాయించారని, వాటిని మండలాల స్థాయికి పంపించి ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ప్రతి మండలానికి ఒక వాహనం చొప్పున అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామన్నారు.తల్లీ బిడ్డా ఎక్స్ప్రెస్ సేవల ద్వారా గర్భిణీ స్త్రీలను ఇంటి నుంచి ఆసుపత్రికి, ప్రసవం అనంతరం ఆసుపత్రి నుంచి తిరిగి ఇంటికి ఉచితంగా తీసుకెళ్లే పిక్అప్, డ్రాప్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# స్విమ్స్ యూజీ వైద్య విద్యార్థినులకు ఇంటెర్నిషిప్ ఓరియెంటేషన్ ప్రోగ్రాం

**తిరుపతి ఆగష్టు 11 మనం న్యూస్:** శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) కు అనుబంధంగా వున్న శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో మంగళవారం ఎంబీబీఎస్ ఉత్తీర్ణత సాధించిన 2021-22 బ్యాచ్ మొత్తం 163 మంది ఇంటర్నిస్ విద్యార్థినులకు ఒరింటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించడం జరిగిందని మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు.ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు ఉపకులపతి డా ఆర్. వి. కుమార్ , డీన్ డా. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్ల, మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ డా కె. ఉమామహేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్స్ డా.శర్వాణి, డా. విజయలక్ష్మి, ఆర్. యం. ఓ . సతీష్ జనరల్ సర్జరీ డా శ్రీహరి రావు గార్లు సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్విమ్స్ సంచాలకులు



మరియు ఉపకులపతి డాక్టర్ ఆర్ వి కుమార్ గారు మాట్లాడుతూ₹ .... ముందుగా ఇంటర్నేస్ కి శుభాకాంక్షలు అందించారు. ఇంటర్నేషిప్ సమయాన్ని పీజీ ప్రిపరేషన్ సమయంగా కాకుండా బెడ్ సైడ్ స్కిల్స్, ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ మొదలైన వాటిలో అనుభవం సాధించాలని పేర్కొన్నారు. చికిత్స చేసి ప్రాణం కాపాడే దేవుడిగా డాక్టర్లు నమ్ముతారని ఆ నమ్మకాన్ని ప్రతి వైద్యురాలు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రాణాలు కాపాడటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే వారే వైద్యులని తెలిపారు

# గ్రంథాలయాలలో మౌలిక వసతులు కల్పన కొరకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్



**చిత్తూరు, ఆగస్టు,11మనం న్యూస్:** ప్రతి నెల గ్రంథాలయాల అభివృద్ధికి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుంది అని జాయింట్ కలెక్టర్ అ. రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ కార్యాలకు సమావేశం మందిరంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గ్రంథాలయ సంస్థకు రావలసినటువంటి చెస్ బకాయిలు కొన్ని కోట్లు రూపాయలు వసూలకు సంబంధించి అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఇది విద్యార్థులకు, ప్రజలకు అందరికీ ఉపయోగపడేటువంటి వ్యవస్థ దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉన్నది గ్రంథాలయాలు చెస్ చెల్లించుటకు రాగల మూడు నెలల కార్యాచరణకు సంబంధించి గ్రంథాలయ అధికారులు ,మున్సిపల్ అధికారులు కలిసి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

## అస్తవ్యస్తంగా ఉన్న తిరుపతి రోడ్లు, కాలువలను తక్షణమే మరమ్మత్తు చేయాలి




**తిరుపతి ఆగస్టు 11 మనం న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పాదయాత్రల్లో భాగంగా తిరుపతి నగరంలో చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి. మురళి తెలిపారు. మంగళవారం తిరుపతి యం ఆర్ పల్లి సీతమ్మ నగర్ లో మార్పు కోసం పాదయాత్ర జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే సీపీఐ పాదయాత్రల ప్రధాన ఉద్దేశమన్నారు. పాదయాత్రలో ప్రజలు స్వచ్ఛందంగా తమ సమస్యలను సీపీఐ నాయకుల దృష్టికి తీసుకువస్తున్నారని తెలిపారు. తిరుపతి నగరంలో అనేక ప్రాంతాల్లో కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందని, వర్షం కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు, నాలుగు నెలల క్రితం వేసిన రోడ్లు సైతం ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిని గుంతలమయంగా మారాయని విమర్శించారు.

## ఎంత వెళ్లినా..

మనసు ఎంత వెనక్కి వెళ్లాలనుకున్నా
అప్పటి వాళ్ళను మళ్లీ కలవలేం
ఆ ఆనవాళ్ళను తాకలేం
ఆ ఉద్వేగాలను ఆ అద్భుత ఉదయాలను
ఆ ప్రశాంత సంధ్యా సమీరాలను
మళ్ళీ అందుకోలేం
తెరపడిన నాటకాన్ని
రెండో సారి రక్తికట్టించలేరు
తోట ప్రతిసారి
అదే పరిమళాలు వెదజల్లదు

గాలి వచ్చిన దారినుండే
మళ్ళీ మళ్ళీ రాదు
తడిసిన అన్ని నేలలకు
ఒకే వాసన రాదు
పొదలోకి వెళ్ళిన
కుందేళ్లలో నీ కంటికి చూసింది
మళ్లీ దొరకదు
ఒక సారి ఇంటి ముందు వాలిన
పిట్టలు మళ్లీ రావు

కూలిన వంతెన కట్టినా
పాతదాని అందం రాదు
తెగిన మాట కలిపినా
కనిపించని ఖాళీలు
లోపల విసిగిస్తూనే ఉంటాయి
సీతాకోకలు పాత వర్ణాలతోనే రావు
పోయిన వాటి వర్ణాలు
నీకు గుర్తుకు రావు

**- డా. సుంకర రమేశ్**
9492180764

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు**
**manamlekhalu@ gmail.com**
**మెయిల్ అడ్రస్‌కు పంపగలరు**

**ఈ పేపర్ కోసం**
**https://www.manamepaper.com/**
**వెబ్‌సైట్‌లో చూడండి– ఎడిటర్**

# యువత విలువలతో వికసించాలి



ఒక వైపు మద్యం,మాదక ద్రవ్యాలతో యువశక్తి నిర్వీర్యమైపోతున్నది. మరోవైపు యువ జనాభా పలు దేశాల్లో తగ్గుముఖం పట్టి, ఆందోళన కలిగిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అభివృద్ధి జరగడానికి అవకాశం లేదు.

'ఎవరో వస్తారని...ఏదో చేస్తారని...ఎదురు చూసి మోస పోకుమా...నిజం మరచి నిదుర పోకుమా'... అంటూ నిద్రాణంలో ఉన్న సమాజాన్ని మేల్కొలపడానికి శ్రీశ్రీ 'భూమి' సినిమా కోసం సుమారు 52 సంవత్సరాల క్రితం రచించిన గీతం నేటికీ శ్రోతల వీనులను స్పృశిస్తున్న మాట వాస్తవం. నేటికీ మారని వ్యవస్థలో మార్పుకోసం ఈ గీతాన్ని పదే పదే వినిపించాలి. ఎవరూ ఎవరినీ ఉద్ధరించరు. మన కోసం మనమే ప్రయత్నించాలి. మనలో అంకురించిన నిర్మాణాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టి, దేశానికి ఉపయోగపడాలి. గాడాంధకారంలో వెలుతురు కోసం అన్వేషించడం కంటే, చీకట్లు కమ్ముకోకముందే,రాబోయే విపత్కర పరిణామాలను సునిశితంగా పరిశీలించి, అవరోధాలకు అడ్డుకట్టవేయడం శ్రేయస్కరం. సచ్ఛీలత, నిజాయితీ, మానవీయత మనిషి వ్యక్తిత్వాన్ని శిఖర స్థాయిలో నిలబెడుతుంది.

బతుకు దెరువు కోసమో, ఇతర స్వార్థ ప్రయోజనాల కోసమో వ్యక్తిత్వాన్ని మసకబార్చుకోవడం దురదృష్టకరం. ఇదొక రకమైన భావ దారిద్ర్యం. పరుల అడుగులకు మడుగులొత్తే సంస్కృతి మారాలి. ఆత్మాభిమానం ప్రాణం కంటే విలువైనదనే సత్యాన్ని నేటి యువతరం గ్రహించాలి. వర్షం వెలసిన తర్వాత గొడుగును అవతలికి విసిరికొట్టడం, రుచిని అస్వాదించిన తర్వాత కూరలో కరివేపాకును తీసిపారేయడం, అవసరానికో రంగు మార్చడం, అవసరానికి అక్కరకు చేరి, అవసరం తీరిన తర్వాత అధః పాతాళానికి తొక్కడం విలువల పతనానికి పరాకాష్ఠ. ఇలాంటి భావాలు మారాలి. ముఖ్యంగా యువతను ఇలాంటి పెడధోరణుల నుంచి కాపాడాలి. యువజనం నిస్వార్థంతో, ఆత్మాభిమానంతో విలువల ఆధారంగా శ్రమశక్తిని, నైపుణ్యాన్ని ఆయుధంగా చేసుకుని జీవించాలి.ప్రతిభకు మించిన ఆయుధం, వ్యక్తిత్వానికి మించిన ఆభరణం మరొకటి లేదనే సత్యం గ్రహించాలి.

నిజమైన ప్రతిభ మరుగున పడిపోతే, అది సమాజానికి శాపం. ఈ భువిపై జీవించి ఉన్నప్పుడే సక్రమమైన నడవడికతో, వ్యక్తిత్వ వికాసంతో మెలగాలి. జీవిత చరమాంకంలో పశ్చాత్తాప పడినా ఫలం శూన్యం.

వర్తమానంలో స్వార్థం పరాకాష్ఠకు చేరింది. మానవత్వ విలువలు మంటగలిసాయి. ధనార్జనకే గాని, విలువలకు పనికి రాని వ్యక్తుల వలన సమాజానికి ఒరిగేది శూన్యం.

ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలపై యువతకు అవగాహన కలిగించి, ప్రపంచ నిర్మాణం వైపు యువతను కార్యోన్ముఖులను చేయడం, యువతకు సమస్యలపై పోరాడే బాధ్యతలను అప్పగించి, ప్రత్యక్ష భాగస్వామం కల్పించడం, న్యాయ సంబంధమైన, సామాజిక,ఆర్థిక,రాజకీయ సంబంధమైన అంశాల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రపంచాన్ని పురోగమనంవైపు పయనించే టట్టు మార్గనిర్దేశనం చేసి, ప్రగతికి బాటలు వేయడమే అంతర్జాతీయ యువజన దినోత్సవం ముఖ్యోద్దేశం.

నేడు ప్రపంచం అనేకమైన సమస్యలను ఎదుర్కొంటున్నది. నిరక్షరాస్యత,నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, లింగ వివక్షత వంటి సమస్యలతో పాటు ఉగ్రవాదం, మాదకద్రవ్యాల వినియోగం,అక్రమ రవాణా, హింస, శ్రమదోపిడీ, అత్యాచారాలు, అవినీతి, బాల కార్మిక వ్యవస్థ, లైంగిక హింస వంటివి మాత్రమే కాకుండా సామాన్య ప్రజలకు కావలసిన కూడు, గూడు, గుడ్డ, విద్య, ఆరోగ్యం వంటి సమస్యలు ఎన్నో ఉన్నాయి. పల్లెల్లో ఈ నాటికీ పారిశుద్ధ్య సమస్యలు, త్రాగునీటి సమస్య వంటి ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయి. చాలా దేశాలు తీవ్రవాద సమస్యతో బెంబేలెత్తి పోతున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు బలహీన దేశాలను కబళించడానికి ప్రయత్నిస్తున్నాయి. పొరుగుదేశాల అవసరాలను ఆసరాగా చేసుకుని, ఇతర దేశాల్లో ఉగ్రవాదానికి సహకరిస్తున్నాయి.



అనునిత్యం ప్రజలు పేదరికంతో బ్రతక లేక నానా అవస్థలు పడుతుంటే ఇదే అదనుగా భావించి,కొన్ని దుష్టశక్తులు యువతలోని బలహీనతలను తమకు అనుకూలంగా మలచుకుని, వారిని వివిధ రకాల మాఫియా విషవలయాల్లోకి మళ్ళించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. యువశక్తి విధ్వంసానికి వినియోగపడితే, తద్వారా సంభవించే పరిణామాలు ఊహాతీతం. ప్రపంచంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎన్నో ఉన్నాయి.వీటికి తోడుగా మానవ తప్పిదాలతో సృష్టించిన కాలుష్య సమస్య, పర్యావరణం, ప్రకృతి విధ్వంసం, ప్లాస్టిక్ సమస్య, గ్లోబల్ వార్మింగ్ వంటి ఎన్నో సమస్యలు ఉన్నాయి. 1991 వ సంవత్సరం ఆస్ట్రేలియా రాజధాని వియన్నా లో నిర్వహించిన వరల్ యూత్ ఫోరంలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత తమ కోసం ప్రతీ ఏటా అంతర్జాతీయ యువదినోత్సవం జరపాలని అభ్యర్ధించింది. 1998లో యువదినోత్సవంపై ప్రకటన వెలువడడం, 1999లో ఐక్యరాజ్య సమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.2020 వ సంవత్సరం నుండి అధికారికంగా ప్రతీ ఏటా ఆగస్టు 12.వ తేదీని అంతర్జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకోవడం రెండు దశాబ్దాలుగా జరుగుతున్నది.ప్రపంచం ఎదుర్కొంటున్న పెనుసవాళ్ళను పరిష్కరించి, స్థానికంగాను,జాతీయంగాను,అంతర్జాతీయం గాను, యువతను ప్రభావితం చేసి,చైతన్యం నింపి,వారి ప్రాధాన్యత ను పెంచి,యువతను అయా సమస్యల పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వాములను చేయడానికి ఐ,రా.స నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా యువత సమస్యలను పరిష్కరించి, యువత ద్వారా నూతన ప్రపంచ నిర్మాణానికి ఐ.రా.స ఒక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. ప్రపంచం భౌగోళికంగా వివిధ ఖండాలుగా,వివిధ దేశాలుగా విడిపోయినప్పటికీ ప్రజలందరిదీ ఒకే జాతి. అదే మానవ జాతి. మానవులంతా స్వేచ్ఛా,సౌభ్రాతృత్వాలతో కలసి మెలసి జీవించాలి. ఈ సత్కార్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకం. ఎక్కడ యువత అన్నిరంగాల్లో నైపుణ్యత ప్రదర్శించి, తలెత్తుకుని జీవిస్తుందో అక్కడ అభివృద్ధి తాండవిస్తుంది. ఎక్కడ యువత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూ, నిస్తేజమౌతుందో అక్కడ అభివృద్ధికి స్థానం ఉండదు.

**(ఆగష్టు12, అంతర్జాతీయ యువ జన దినోత్సవం)**
**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

# గ్రంథపాలకుడికి స్ఫూర్తి ఎస్. ఆర్. రంగనాథన్



జ్ఞానానికి దారి చూపిన మహర్షి - ప్రతి గ్రంథపాలకుడికి స్ఫూర్తి పుస్తకాలు మాట్లాడవు... కానీ వాటిని మనిషి జీవితాన్ని మార్చేలా మాట్లాడించగల వ్యక్తి గ్రంథపాలకుడు. ఈ భావనను తన జీవితమంతా ఆచరణలో చూపించి, గ్రంథాలయాన్ని కేవలం పుస్తకాల నిల్వగదిగా కాకుండా సమాజ వికాసానికి కేంద్రబిందువుగా మార్చిన మహనీయుడు డాక్టర్ షియాలి రామం అమృత రంగనాథన్.


1892 ఆగస్టు 12న తమిళనాడులోని షియాలి (ప్రస్తుత మయిలాడుతురై)లో జన్మించిన రంగనాథన్ చిన్ననాటి నుంచే చదువుపట్ల అసాధారణ ఆసక్తి కనబరిచారు. గణితశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి కొంతకాలం అధ్యాపకుడిగా పనిచేశారు. అయితే విధి ఆయనను మరో మహోన్నత మార్గంలో నడిపించింది. 1924లో మద్రాస్ విశ్వవిద్యాలయ గ్రంథపాలకుడిగా నియమితులైన తరువాత ఆయన జీవితమే మారిపోయింది. అప్పటి వరకు గ్రంథాలయాలు పుస్తకాలను భద్రపరిచే గదులుగా మాత్రమే ఉండేవి. కానీ రంగనాథన్ దృష్టిలో గ్రంథాలయం అనేది జ్ఞానాన్ని ప్రజలకు చేరవేసే సజీవ వ్యవస.

గ్రంథాలయ శాస్త్రానికి కొత్త దిశ డాక్టర్ రంగనాథన్ పేరు వినగానే ప్రపంచవ్యాప్తంగా గుర్తుకొచ్చేది ఆయన ప్రతిపాదించిన గంథాలయ శాస్త్రంలోని ఐదు సూత్రాలు.. పుస్తకాలు ఉపయోగించడానికే, ప్రతి పాఠకుడికి అతనికి అవసరమైన పుస్తకం లభించాలి, ప్రతి పుస్తకానికి దానిని చదివే పాఠకుడు ఉండాలి. పాఠకుని సమయాన్ని ఆదా చేయాలి. గ్రంథాలయం నిరంతరం అభివృద్ధి చెందే జీవి.

ఈ ఐదు సూత్రాలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల గ్రంథాలయాల నిర్వహణకు మార్గదర్శకాలుగా నిలిచాయి. డిజిటల్ యుగం లోనూ వాటి ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. ఒక శతాబ్దం క్రితం ఆయన చెప్పిన ఈ భావనలు నేడు కృత్రిమ మేధస్సు, డిజిటల్ గ్రంథాలయాల యుగంలో కూడా సమానంగా వర్తిస్తుండటం ఆయన దూరదృష్టికి నిదర్శనం.

గ్రంథాలయ శాస్త్రంలో డాక్టర్ రంగనాథన్ చేసిన అత్యంత గొప్ప ఆవిష్కరణ కాలన్ క్లాసిఫికేషన్ (Colon Classification). సంప్రదాయ వర్గీకరణ పద్ధతుల పరిమితులను అధిగమిస్తూ, విజ్ఞానాన్ని మరింత శాస్త్రీయంగా వర్గీకరించే ఈ విధానాన్ని ఆయన రూపొందించారు. ప్రపంచంలోని అనేక గ్రంథాలయాలు ఈ పద్ధతిని అనుసరించాయి.

డాక్టర్ రంగనాథన్ ఒక గొప్ప సిద్ధాంతకర్త మాత్రమే కాదు. అద్భుత రచయిత కూడా. ఆయన జీవితకాలంలో 60కు పైగా గ్రంథాలు, దాదాపు 2,000కు పైగా పరిశోధనా వ్యాసాలు రచించారు. ఆయన ప్రసిద్ధ గ్రంథాలలో కొన్ని.. ఫైవ్ లా సు ఆఫ్ లైబ్రరీ సైన్స్, లైబ్రరీ అడ్మినిస్ట్రేషన్, రిఫరెన్స్ సర్వీస్, ప్రొలెగామినా టు లైబ్రరీ క్లాసిఫికేషన్.. ఈ రచనలు నేటికీ ప్రపంచవ్యాప్తంగా




గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులకు ప్రామాణిక గ్రంథాలుగా ఉపయోగపడుతున్నాయి.

డాక్టర్ రంగనాథన్ గారి ప్రతిభకు భారతదేశ సరిహద్దులు సరిపోలేదు. ఆయన 1948లో యూరప్ మరియు అమెరికా దేశాల్లో పర్యటించి, అక్కడి గ్రంథాలయ వ్యవస్థలను అధ్యయనం చేశారు. ఆ పర్యటన అనుభవాలను Library Tour, 1948: Europe and America అనే గ్రంథంగా రూపొందించారు. ఆయన అంతర్జాతీయ గ్రంథాలయ సమావేశాల్లో పాల్గొని, భారతదేశపు గ్రంథాలయ శాస్త్రాన్ని ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన ప్రసంగాలు, ఉపన్యాసాలు గ్రంథాలయ రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోయాయి. ఆయన ప్రతిపాదించిన ఐదు సూత్రాలు, కాలన్ వర్గీకరణ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా గ్రంథాలయాల్లో ఆదరణ పొందాయి.

డాక్టర్ రంగనాథన్ గారి సేవా జీవితం వివిధ ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ప్రకాశించింది. మద్రాస్ విశ్వవిద్యాలయం (1924-1945). మొదటి గ్రంథపాలకుడిగా 20 ఏళ్లపాటు సేవలందించి, ఆ గ్రంథాలయాన్ని ఒక ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం (1945-1947)..గ్రంథపాలకుడిగా, గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం (1947-1955), గ్రంథాలయ శాస్త్ర ఆచార్యుడిగా, భారతదేశంలోనే మొట్టమొదటి ఉన్నత విద్యను అందించే గ్రంథాలయ శాస్త్ర పాఠశాలకు మార్గదర్శకత్వం వహించారు. డాక్యుమెంటేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (DRTC), బెంగళూరు (1962), ఆయన కృషి ఫలితంగా ఏర్పడిన ఈ సంస్థ నేటికీ డాక్యుమెంటేషన్ రంగంలో అగ్రగామిగా నిలిచింది.

డాక్టర్ రంగనాథన్ గారు కేవలం ఒక గ్రంథపాలకుడు మాత్రమే కాదు. ఒక సంఘటనా నిర్మాత. ఆయన స్థాపించిన సంస్థలు నేటికీ గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరిగా నిలుస్తున్నాయి. మద్రాస్ లైబ్రరీ అసోసియేషన్ (MaLA) - 1928 జనవరి 31. ఇది భారతదేశంలోని తొట్టతొలి గ్రంథాలయ సంఘాల్లో ఒకటి. ఇది గ్రంథాలయ ఉద్యమానికి సజీవ చిహ్నంగా మారింది.

ఇండియన్ లైబ్రరీ అసోసియేషన్ (ILA) - 1933: ఆయన ఈ సంస్థకు 1944 నుండి 1953 వరకు అధ్యక్షుడిగా పనిచేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రంథాలయ శాస్త్ర విభాగం-1946. ఇది భారతదేశంలోనే తొట్టతొట్టి గ్రంథాలయ శాస్త్ర విభాగం.

డాక్టర్ రంగనాథన్ సేవలను ప్రపంచం గుర్తించింది. ఆయన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ డాక్యుమెంటేషన్ (FID)కి గౌరవ సభ్యులుగా ఎన్నికయ్యారు. లైబ్రరీ అసోసియేషన్ ఆఫ్ గ్రేట్ బ్రిటన్‌కి ఆజీవం ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయం 1964లో ఆయనకు D. Litt. గౌరవ డిగ్రీని ప్రదానం చేసింది. 1965లో భారత ప్రభుత్వం ఆయనను జాతీయ పరిశోధనా ఆచార్యుడిగా (National Research Professor) నియమించి సత్కరించింది.

గ్రంథాలయ రంగానికి ఆయన చేసిన అసాధారణ సేవలకు భారత ప్రభుత్వం 1957లో 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. ఆయన స్మృతిగా 1992లో భారత ప్రభుత్వం ఆయన పేరుతో ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది.

డాక్టర్ రంగనాథన్ గ్రంథాలయాలను నగరాలకు మాత్రమే పరిమితం చేయలేదు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా గ్రంథాలయ సేవలు అందాలనే లక్ష్యంతో జీవితాంతం కృషి చేశారు. ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలి అనే ఆయన ఆలోచన దేశవ్యాప్తంగా ప్రజా గ్రంథాలయ ఉద్యమానికి ఊపిరి పోసింది.

ప్రతి సంవత్సరం ఆగస్టు 12న దేశవ్యాప్తంగా జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని జరుపుకోవడం వెనుక ఒక గొప్ప సందేశం ఉంది. అది కేవలం ఒక మహనీయుడి జన్మదినాన్ని గుర్తుచేసుకోవడం కాదు. జ్ఞానాన్ని సమాజానికి చేరవేసే ప్రతి గ్రంథపాలకుడి సేవలను గౌరవించడం.

డాక్టర్ ఎస్. ఆర్. రంగనాథన్ ఒక వ్యక్తి కాదు. ఒక ఆలోచన. ఆయన నిర్మించిన సూత్రాలు, రచించిన గ్రంథాలు, వెలిగించిన జ్ఞాన దీపాలు, స్థాపించిన సంస్థలు, శాసించిన సంఘాలు - ఇవన్నీ నేటికీ లక్షలాది గ్రంథపాలకుల చేతుల్లో వెలుగుతున్నాయి. ప్రపంచం ఎంతగా మారినా, సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, జ్ఞానాన్ని మనిషి చేతుల్లోకి చేర్చాలనే ఆయన తపన శాశ్వత సత్యంగా నిలిచిపోతుంది. 'ఒక మంచి గ్రంథపాలకుడు వేలాది గురువుల సేవను ఒకేచోట అందించగలడు' అనే భావనకు డాక్టర్ రంగనాథన్ జీవితం సజీవ సాక్ష్యం. ఆయన కలలు కన్న గ్రంథాలయాలు జ్ఞాన ఆలయాలుగా వికసిస్తూ ఉండటం, ఆయనకు మనం అందించే నిజమైన నివాళి.

**(ఆగస్టు 12న గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డా. ఎస్. ఆర్. రంగనాథన్ జన్మదినం)**
**- రవికుమార్ చేగోని**

# చేతిరాతతోనే ఉజ్వల భవిష్యత్తు



కుదురుగా, అందంగా చేతిరాత రాయడం ఓ అద్భుత కళ. విలక్షణమైన చేతిరాత ఒక కళాత్మక వ్యక్తీకరణగా, అందమైన అక్షరాల పొందికను వివరించే విజ్ఞానాన్ని కాలిగ్రఫీ లేదా చేతిరాత అని పిలుస్తున్నాం. చేతిరాత పట్ల అవగాహన పెంచడానికి కార్యశాలలు, ఆన్‌లైన్ కార్యక్రమాలు, కొత్త రాతలను నేర్చుకోవడం, అందమైన రాత కోసం సాధన చేయడం కొనసాగాలి. సాధారణంగా మంచి చేతిరాతతో పునాది పాఠశాల స్థాయిలోనే జరుగుతుంది. కుదురుగా అక్షరాలు రాయడానికి పాఠశాల స్థాయిలో డబుల్‌రోల్ నోట్ బుక్స్‌లో రాయడం నేర్పిస్తారు.

కాలిగ్రఫీ నైపుణ్యం పట్ల ప్రాధాన్యాన్ని అవగాహన పరచడం, చేతిరాతను మెరుగు పరుచుకోవడం, అందమైన చేతిరాత పట్ల ఆసక్తిని కనబరచడం లాంటి ముఖ్యమైన అంశాలను చర్చించే వేదికగా ప్రతి ఏటా ఆగష్టు 2వ బుధవారం రోజు, అనగా 12 ఆగష్టున ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం పాటించడం ఒక ఆచారంగా వస్తున్నది. 2017లో 'మ్యాన్యుస్క్రిప్ట్స్' పెన్ కంపెనీ ప్రారంభించిన ప్రపంచ కాలిగ్రఫీ రోజు, ముఖ్యంగా విద్యాలయాల్లో అందమైన చేతిరాత పోటీలను నిర్వహించడం జరుగుతుంది. చేతిరాత ప్రక్రియలో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను ప్రశంసించడం ఒక మంచి సాంప్రదాయం. అది ఒక ప్రత్యేక నైపుణ్యం అని గుర్తించాలి.

కాలిగ్రఫీ అంటే కేవలం అందంగా రాయడం మాత్రమే కాదు. దీని వల్ల ఏకాగ్రత, మనసుకు ప్రశాంతత, జ్ఞాపకశక్తి, మెదడు చురుకుదనం, సృజనశీలత, క్రమశిక్షణ పెరగడం జరుగుతుంది. అందమైన లిపి చదివితే తేలికగా అర్థం అవుతుంది. కుదురుగా రాయడం వల్ల మనకు మంచి గుర్తింపు వస్తుంది. చేతిరాతను బట్టి మన వ్యక్తిత్వాన్ని సహితం అంచనా వేస్తారు. అందమైన చేతిరాతతో పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందవచ్చు. మనం సరైన సమాధానం రాసినప్పటికీ చెడు చేతిరాత వల్ల రావలసినన్ని మార్కులు రాక పోవచ్చు. మన చేతిరాత కూడా మన విద్యా భ్యాసంలో కీలక పాత్రను పోషిస్తున్నది. మంచి చేతిరాత ఉన్న విద్యార్థుల పేపర్లను ఉపాధ్యాయుడు ఆసక్తిగా చదివి మంచి మార్కులు లేదా గ్రేడ్స్ వేస్తారు. చేతిరాతను మెరుగుపరచడానికి చిన్నతనంలోనే ప్రత్యేక శిక్షణను ఇప్పించాలి. అక్షరాలు సరైన పరిమాణంలో అందంగా రాయడం, పదానికి పదానికి మధ్య గ్యాప్ వదలడం, మార్జిన్ ఇవ్వడం, ఒకే లైన్‌లో రాయడం లాంటి జాగ్రత్తలు తీసు కోవాలి.




అందంగా చేతిరాత రాయడంలో మనం కూర్చునే విధానం కూడా ప్రభావితం చేస్తుంది. వెన్నెముక నిటారుగా ఉండేలా కూర్చొని, కాళ్లు నేలకు ఆనించి రాయడం వల్ల చేతిపై ఒత్తిడి తగ్గి అక్షరాలు కుదురుగా రాయడానికి ఉపకరిస్తుంది. పెన్ను పట్టుకునే విధానం కూడా కాలిగ్రఫీలో ముఖ్యం అని గమనించాలి. చూపుడు వేలు, బొటన వేలు మధ్య పెన్నును పట్టుకోవాలి. పెన్నులను గట్టిగా పట్టుకోవద్దు. మనం రాసే అక్షరాల సైజ కూడా చేతిరాతను నిర్ణయిస్తుంది. పేజీకి నాలుగు వైపులా మార్జిన్ తీసుకోవడం, మరో చిన్నగా లేదా మరో పెద్దగా అక్షరాలు రాయవద్దు. అభ్యాసం వల్ల చేతిరాత సులభంగా మెరుగుపడుతుంది. చేతి గీతాలు బాగుంటే మన భవిష్యత్తు బాగున్నట్లే, చేతిరాత బాగుంటే ఊహించిన దాని కన్న అధిక మార్కులు వస్తాయి. చేతిరాత బాగా రాసేవారి ఆత్మవిశ్వాసం అధికంగా ఉంటుంది. చదువుతో పాటు చేతిరాతతో కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. చేతిరాత స్పష్టత కోల్పోతే సరైన సమాధానమే అయినప్పటికీ మంచి మార్కులు రావని తెలుసుకోవాలి. చేతిరాత మెరుగుపరుచుకోవడానికి సమయం కేటాయించి ప్రత్యేక శిక్షణ, అభ్యాసం పొందాలి

**(12 ఆగష్టు ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం)**
**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే గ్రామానికి గుండె. అక్కడి నుంచే డాక్టర్లు, ఇంజినీర్లు, కలెక్టర్లు, ఉపాధ్యాయులు తయారయ్యారు. కానీ నేడు ఆ గుండె చప్పుడు నెమ్మదిస్తోంది. క్లాస్రూమ్లు ఖాళీ అవుతున్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ఇది కేవలం గణాంకాల సమస్య కాదు. ఇది భవిష్యత్తుకు సంబంధించిన ప్రశ్న. తల్లిదండ్రుల ఆకాంక్ష సహజం. తమ పిల్లలకు మెరుగైన ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ సౌకర్యాలు, క్రమశిక్షణ, పోటీ పరీక్షల శిక్షణ కావాలని కోరుకుంటున్నారు. ఆ కారణంగానే ప్రైవేట్ పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గి, ఉపాధ్యాయుల బదిలీలు, పాఠశాలల విలీనం, మూసివేత వంటి పరిస్థితులు వస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ప్రభుత్వం డిజిటల్ తరగతులు, ఇంగ్లీష్ మీడియం, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, స్కాలర్‌షిప్‌లు వంటి పథకాలతో ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని మారుస్తోంది. చాలా పాఠశాలల్లో ఇప్పుడు స్మార్ట్ టీవీలు, ల్యాబ్‌లు, ఆటస్థలాలు కూడా ఉన్నాయి. సమస్యలు ఉన్నా, మార్పు కూడా కనిపిస్తోంది. విద్య అనేది వ్యాపా రమా లేక హక్కా? ప్రభుత్వ పాఠశాలలు మూతపడితే నష్టపోయేది ఎవరు? పేద, మధ్యతరగతి కుటుం బాల పిల్లలే. ఫీజు కట్టలేని కారణంగా లక్షల మంది చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో వస్తున్న మంచి ఫలితాలను, సౌకర్యాలను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలి. తల్లిదండ్రుల్లో విశ్వాసం పెంచాలి. గుణాత్మక విద్య ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, పాఠ్యప్రణాళికలో ఆధునికత, ఫలితాల బాధ్యత తప్పనిసరి. సౌకర్యాల కల్పన ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు, మరుగుదొడ్లు, తాగునీరు, లైబ్రరీ, ఇంటర్నెట్. సమాజ భాగస్వామ్యం, పూర్వ విద్యార్థులు, స్థానిక సంస్థలు, CSR నిధులు పాఠశాలల అభివృద్ధికి వాడాలి. ప్రభుత్వ పాఠశాలల బలహీనత ప్రభుత్వానిది మాత్రమే కాదు. అది మొత్తం సమాజం



యొక్క బాధ్యత. ఈ రోజు మనం పట్టించుకోకపోతే, రేపు సమాన అవకాశాల తలుపులు మూసుకుపోతాయి. విద్యార్థుల సంఖ్య తగ్గడం అనేది విద్యా వ్యవస్థకు ఇస్తున్న చివరి హెచ్చరిక. దీన్ని అవకాశంగా మార్చుకుని, ప్రభుత్వ పాఠశాలలను మళ్లీ గౌరవంగా, గర్వంగా చెప్పుకునే స్థాయికి తీసుకురావాల్సిన సమయం ఇది.

**- ఉక్కల్ కర్ రాజేందర్ నాథ్**
9440287170

## రాజభవనాల... ప్రపంచం

రాజభవనాల,సింహాసనాల,కిరీటాల
ఈ ప్రపంచం,
మనిషికి బద్ధశత్రువైన సమాజాల ఈ ప్రపంచం,
సంపదకై ఎంతో ఆకలిగొన్న
ఆచారమయప్రపంచం,
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?

ప్రతిదేహం క్షతగాత్రం,
ప్రతి ఆత్మా దాహపరితప్తం,
చూసేచూపుల్లో సందిగ్ధతా,హృదయాల్లో విషాదం,
ఇది ప్రపంచమా లేక భయాయోమయ లోకమా?
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?

ఇక్కడ- మనిషి ఉనికి కేవలం ఒక బొమ్మ,
ఈ బస్తీ- శవారాధకులు తిరుగాడే వాడల బస్తీ,
ఇక్కడ- బ్రతుకు కన్నా చావే చాలా చాలా చౌక,
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?

యువత- చెడుదారుల్లో తిరుగుతూ ఉంటుంది,
యవ్వనం-తానే విపణివీధై ముస్తాబౌతుంటుంది,
ఇక్కడ- ప్రేమ వ్యాపారమై జీవిస్తూ ఉంటుంది,
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?

ఎక్కడ మనిషికి ఏ విలువా లేదో
ఆ ప్రపంచ మిది,
విశ్వాస మేమీ ఉండదు, స్నేహమూ
ఏమీ ఉండదు,
ప్రేమకు కనీసగౌరవం లేనటువంటి
ప్రపంచ మిది,
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?
ఇటువంటి ప్రపంచాన్ని
కాల్చేయ్,బూడిదచేసేయ్,
ఈ ప్రపంచాన్ని నా ముందు కనిపించనీయకు,
ఈ ప్రపంచం నీదే,నీవే నీవే సంబాళించుకో,
ఈ ప్రపంచ మొకవేళ నా కథీనమైనా ఏముందీ?

**హిందీమూలం**
సాహిర్ లుధియాన్వీ
**స్వేచ్ఛానువాదం**
**- 'రఘువర్మ'**
9290093933



# ఆక్వా రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

**జోన్, నాన్జోన్ పరిమితి లేకుండా రూ 1.50కే యూనిట్ విద్యుత్**

రైతుల సమక్షంలోనే జీవో నెం.57 విడుదల..

ఆక్వా రంగం సీఎం చంద్రబాబు మానస పుత్రిక..

బ్లూ ఎకానమీలో ఏపీని రోల్మోడల్గా తీర్చిదిద్దుతాం

26 నెలల్లో 99 శాతం ఎన్నికల హామీల అమలు

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**పాలకొల్లు శ్రీకాకుళం ఆగస్టు 11, 2026:** ఆక్వా రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలక హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. జోన్, నాన్జోన్తో సంబంధం లేకుండా, పదెకరాల పరిమితి లేకుండా అర్హులైన ప్రతి ఆక్వా రైతుకూ యూనిట్ విద్యుత్ను రూ.1.50 కి అందించేందుకు జీవో నెం.57ను రైతుల సమక్షంలోనే విడుదల చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. పాలకొల్లులో వేలాది మంది ఆక్వా రైతుల సమక్షంలో నిర్వహించిన భారీ సభలో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన మంత్రి నిమ్మల రామానాయుడు, మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, కామినేని శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు, శాసనమండలి సభ్యులు, సోము వీర్రాజు, కార్పొరేషన్ ఛైర్మన్లు, రైతు సంఘాల నాయకులు, రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆక్వా రైతులు, పాత్రికేయులకు పేరుపేరునా అభినందనలు తెలిపారు.

**వెంటిలేటర్ నుంచి ఆక్సిజన్ తీసుకునే స్థాయికి రాష్ట్రం**

2024 ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామంలా జరిగాయని, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు నిండు హృదయంతో ఆశీర్వదించి ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకొచ్చారని అచ్చెన్నాయుడు అన్నారు. ఆగస్టు 12తో కూటమి ప్రభుత్వానికి 26 నెలలు పూర్తవుతున్నాయని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ప్రభుత్వ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని విమర్శించారు. అధికారంలోకి వచ్చినప్పుడు ఆనందం కంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చూసి భయమే ఎక్కువగా కలిగిందన్నారు. ప్రతి శాఖలో అప్పులే కనిపించాయని, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో ఇవ్వలేని పరిస్థితి నుంచి పాలన ప్రారంభించాల్సి వచ్చిందన్నారు. ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు నాయుడు లాంటి నాయకుడు ఉండటం ఐదు కోట్ల మంది ప్రజల అదృష్టం. ఆయనకు పవన్ కళ్యాణ్ సహకారం, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అందిస్తున్న సహాయంతో 26 నెలల్లో వెంటిలేటర్పై ఉన్న రాష్ట్రాన్ని ఆక్సిజన్ తీసుకునే స్థాయికి తీసుకొచ్చాం. ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులున్నా ప్రజల కష్టం తెలిసిన ముఖ్యమంత్రిగా ఇచ్చిన మాటకు కట్టుబడి చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు అని మంత్రి పేర్కొన్నారు.

**26 నెలల్లో 99 శాతం హామీల అమలు**

దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా కేవలం 26 నెలల్లో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశామని అచ్చెన్నాయుడు అన్నారు.

పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడంతో పాటు వివిధ కేటగిరీలకు రూ.6 వేలు, రూ.10 వేలు, రూ.15 వేల వరకు అందిస్తున్నామన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం, తల్లికి వందనం కింద చదువుకునే పిల్లలకు రూ.15 వేలు, మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు రూ.20 వేలు, చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.20 వేల సాయం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో హామీ ఇవ్వని అనేక కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామన్నారు.


# గీతం ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ కోర్సులలో ప్రవేశాలు

**భీమునిపట్నం, మనం న్యూస్ :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్మెంట్ (ఎంబిఎ, బిబిఎ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బిఎస్సీ, ఎమ్సిఎ, బిసిఎ), లా కోర్సులు, హ్యూమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరిపి మరియు పారామెడికల్ కోర్సులలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కోర్సులకు ఇంజనీరింగ్ కోర్సులతో పాటు బిఫార్మశీ, ఎమ్.ఫార్మశీ, బిఆర్క్ మరియు ఎమఆర్క్ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సులతో పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్సైన్స్ అండ్ టెక్నాలజీ మరియు ఎన్విరాన్మెంటల్ సైన్స్లో 4 సంవత్సరాల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు ఆడ్మిషన్ల డైరక్టర్ తెలిపారు. అలాగే 3సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్స్లో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో పెరుగుతున్న ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రాంగణంలో బిఎస్సీ మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరిపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కోర్సులలో ప్రవేశానికి సంబంధించి పూర్తి వివరాల కోసం గీతం వెబ్సైట్ను పరిశీలించవచ్చునన్నారు.

# పంచధర్లలో అక్రమ మైనింగ్ అడ్డుకోండి

**సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోండి**

**కేంద్ర గనుల మంత్రి కిషన్ రెడ్డిని కోరిన వైఎస్ఆర్సీపీ**



**న్యూఢిల్లీ ఆగస్టు 11(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం జిల్లాలో ఉన్న పంచధర్ల పరిసరాల్లో జరుగుతున్న అక్రమ కంకర తవ్వకాలపై కేంద్రం తక్షణం జోక్యం చేసుకుని, వాటిని నిలిపివేయాలని వైఎస్సార్సీపీ ప్రతినిధుల బృందం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరింది. భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సంరక్షిత ప్రాంతమైన ధనదిబ్బలు బౌద్ధ పురావస్తు ప్రదేశమని, అలాగే ఇక్కడ పురాతన శ్రీ ధర్మలింగేశ్వర స్వామి ఆలయం కూడా ఉందని, వీటికి సమీపంలో భారీ ఎత్తున జరుగుతున్న క్వారీ కార్యకలాపాల వల్ల వీటికి తీవ్ర నష్టం కలుగుతోందని వైఎస్సార్సీపీ ప్రతినిధులు కేంద్రమంత్రి దృష్టికి తెచ్చారు. చారిత్రాత్మక ప్రాముఖ్యత కలిగిన ఈ వారసత్వ ప్రదేశాన్ని పరిరక్షించడానికి కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు కోరారు.ఈ ప్రాంతంలో విచక్షణా రహితంగా జరుగుతున్న క్వారీ కార్యకలాపాలు, తవ్వకాలు పురావస్తు ప్రదేశానికి ముప్పు కలిగిస్తున్నాయని, ఆ ప్రాంత పవిత్రతను, వారసత్వ స్వరూపాన్ని దెబ్బతీస్తున్నాయని వైఎస్సార్సీపీ ప్రతినిధుల బృందం కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి తెలిపింది. బౌద్ధ క్షేత్రమైన ధనదిబ్బలు క్రీ.శ.1వ శతాబ్దపు శాతవాహన కాలం నాటిది కాగా, శ్రీ ధర్మలింగేశ్వర స్వామి ఆలయం క్రీ.శ.10వ శతాబ్దం నాటిదని కిషన్ రెడ్డికి వైఎస్సార్సీపీ బృందం తెలిపింది. ఈ రెండు ప్రదేశాలు అపారమైన చారిత్రక, పురావస్తు ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని పేర్కొంది. అలాంటి రక్షిత పురావస్తు ప్రదేశానికి సమీపంలో అక్రమ మైనింగ్ చేపడుతున్నారని తెలిపింది. ఇటువంటి కార్యకలాపాలు పంచధర్ల కొండ యొక్క భూగర్భ స్థిరత్వాన్ని కూడా దెబ్బతీసి, భూగర్భ జలాలు, సహజ మురుగునీటి వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని తెలిపింది. కాబట్టి ఈ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని కోరింది. అలాగే ఆ ప్రదేశాన్ని పరిశీలించడానికి, మైనింగ్ కార్యకలాపాల చట్టబద్ధతను ధృవీకరించడానికి, మంజూరైన సరిహద్దులు, అనుమతించబడిన లోతు లేదా అధీకృత తవ్వకం పరిమాణాన్ని మించి తవ్వకాలు జరిగాయా లేదా అని నిర్ధారించడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్సీపీ ప్రతినిధి బృందం కేంద్రాన్ని కోరింది. ఉల్లంఘనలు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కూడా కోరింది.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన వైఎస్సార్సీపీ ప్రతినిధుల బృందంలో ఎంపీలు గొల్ల బాబూరావు, మేడా రఘునాధరెడ్డి, గుమ్మ తనుజా రాణి, మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఉన్నారు.

# రిసర్వే పనులు వేగవంతం చేయాలి

**సర్వే శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్. కుమార్**



**అనకాపల్లి, ఆగష్టు 11(మనం న్యూస్):** రిసర్వే పనులు వేగవంతం మరియు పారదర్శకంగా అందించేందుకు రెవెన్యూ మరియు సర్వే అధికారులు కృషి చేయాలని సర్వే శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.ఎన్. కుమార్ పేర్కొన్నారు. ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు రెవెన్యూ మరియు సర్వే అధికారులకు మంగళవారం మధ్యాహ్నం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్వే శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ , కాకినాడ , సి హెచ్.వి.ఎస్.ఎన్. కుమార్, రెవెన్యూ సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై మండల సర్వేయర్లకు, రిసర్వే డిటి లకు సమగ్ర అవగాహన కల్పించారు.

ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి. రెవెన్యూ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని సూచించారు. పెండింగ్లో ఉన్న పిజిఆర్ఎస్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు సమీక్షించి త్వరితగతిన పరిష్కరించాలి. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సకాలంలో సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించి, డిజిటలైజేషన్కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

రెవెన్యూ సేవలకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నూతన విధానాలు, ప్రభుత్వ మార్గదర్శకాలపై అధికారులకు వివరించారు. ప్రజల సమస్యలను సానుకూలంగా స్వీకరించి, నిబంధనల పరిధిలో త్వరతిగతిన పరిష్కారం చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వే ఎ.డి గోపాల్ రాజా, ఇన్స్పెక్టర్ బి యన్ ఎస్ ప్రసాద్, డిఐఓఎస్ లు, మండల సర్వేయర్లు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎట్ హోం కార్యక్రమానికి ఎంపికైన ఏ యూ విద్యార్థిని

**విశాఖపట్నం. ఏ యు. ఆగస్టు 11(మనం న్యూస్):** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15న లోక్ భవన్ నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థిని ఎం ఎస్ ఎల్ వి సృజన ఎంపికయ్యారు ఈ మేరకు లోక్ భవన్ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి దీనికి సంబంధించిన అధికారిక సమాచారం అందిందని ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య డి. సింహాచలం తెలిపారు ఏ యూ లో ఫార్మసీ కళాశాలలో ఫార్మా డి తన ప్రతిభతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు.

# 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా

- **80 వ స్వాతంత్ర్య దినోత్సవం లో భాగంగా దేశ భక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు**
- **దేశ నిర్మాణం లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి**
- **జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**



**విశాఖపట్నం, ఆగస్టు 11:** ఆగస్టు 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం లో భాగంగా జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ మరియు ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రోజుల పాటు జాతీయ జెండాను ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. పరిపాలనా యంత్రాంగం మరియు ప్రజాప్రతినిధులు పౌరులతో కలిసి ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

**స్వాతంత్ర్య దినోత్సవ వేళ**

దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు' కావాలనీ, 80 వ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'దేశ నిర్మాణంలో భాగస్వాములు' (PartnersinNation Building) మరియు అనే నేను (AneNenu) ప్రచార కార్యక్రమాన్ని ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు కేవలం ప్రేక్షకులుగా కాకుండా, ఈ దేశ నిర్మాణంలో తాము భాగస్వాములమే అనే భావనతో స్వచ్ఛందంగా పాలుపంచుకునేలా ఈ ముందస్తు కార్యకలాపాలు ప్రభుత్వం రూపొందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మొక్కల నాటే కార్యక్రమం ఆగస్టు 14 న అటవీ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద , ముఖ్య ప్రదేశాలలో మొక్కలు నాటి, జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఆగస్టు 14 , 15 తేదీలలో ప్రభుత్వ భవనాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో తాము దేశ భవిష్యత్తు కోసం ఏం చేయగలమో వివరిస్తూ స్వయంగా ప్రతిజ్ఞలు చేయనున్నారని తెలిపారు.

**అనే నేను సోషల్ మీడియా ప్రచారం:**

జిల్లాలోని యువత, విద్యార్థులు, ప్రముఖులు, క్రీడాకారులు మరియు పౌరులందరూ PartnersInNationBuilding, MyIndiaMyVision, Independence –ay2026 హ్యాష్ట్యాగ్లతో, జాతీయ జెండాను చేతిలో పట్టుకుని... 'అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా...' అంటూ 30 నుండి 60 సెకన్ల సెల్ఫీ వీడియోను రూపొందించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి APOfficialNews పేజీని ట్యాగ్ చేయాలని కలెక్టర్ కోరారు. వికసిత్ భారత్ మరియు స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 'ఆలోచిద్దాం, ఆచరిద్దాం, వికసిత్ భారత్ను నిర్మిద్దాం' అనే నినాదంతో ముందుకు సాగాలని జిల్లా ప్రజలకు మరియు అధికారులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# ఉరుకుందలో బహిరంగ వేలం పాటలు నిర్వహించిన డిప్యూటీ కమిషనర్ వాణి



**కౌతాళం,ఆగస్టు 11(మనం న్యూస్):** కౌతాళం మండల పరిధిలోనే ఉరుకుంద గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహ ఈరన్న స్వామి దేవస్థానం నందు మంగళవారం రోజున ఆన్లైన్,సీల్ మరియు బహిరంగ వేలము నిర్వహించడమైనది.

1. 2026 శ్రావణమాసం ఉత్సవాల సందర్భముగా ఒక నెల రోజులు శానిటేషన్ పనులు చేయుటకు గాను ఆన్లైన్ టెండర్ ద్వారా ఒకరికి ఒక రోజుకి రూ.499/-లకు లక్ష్మి నరసింహ ఔటసోరసింగ్ ఓర్వకల్లు వారికి.

2. ఒక నెల రోజుకు సెక్యూరిటి సర్వీస్ చేయుటకు సీల్ టెండర్ ద్వారా ఒకరికి ఒకరోజుకి రూ.360/-లకు జి.రామిరెడ్డి, ఉరుకుంద వారికి.

3. సెల్ ఫోన్ మరియు లగేజ్ భద్రపరుచుటకు గాను ఒక సం., కాలమునకు గాను సీల్ టెండర్ ద్వారా రూ.17,10,909/-కు హెచ్చుపాఠదారునిగా జి.రామిరెడ్డి, ఉరుకుంద వారు నిలిచియున్నారు.

4. ఇవి కాకుండా దేవస్థానం నందున్న పాత ఇనుప సామానులు, ప్లాస్టిక్,ఆయిల్ డబ్బాలు బహిరంగ వేలము ద్వారా ఇవ్వడం జరిగిందని డిప్యూటీ కమిషనర్ వాణి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# జిల్లాలో ఏలకుల సాగు ప్రయోగాత్మక పరిశీలన ప్రాజెక్ట్ ప్రారంభం

**గొండెలి పంచాయతీ,లాంపిలి గ్రామం సచివాలయం లో ఎలికుల సాగు పై అవగాహన, ఎలికుల సాగు ప్రారంభ మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి.**




**అల్లూరి జిల్లా పాడేరు, ఆగష్టు 11:** అల్లూరి జిల్లా పాడేరు మండలం, గొండెలి పంచాయతీ, లాంపిలి గ్రామ ప్రాంతాల్లో ప్రయోగాత్మక ఎలికుల సాగును ప్రారంభించిన జిల్లా కలెక్టర్ నిషాంతి.టి కేరళ, కర్ణాటక నుండి వచ్చిన స్ప్రైసెస్ బోర్డ్ శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సాగు భూమి స్థల పరిశీలన చేసి కాఫీ తోటల నీడలో అంతర్ పంటగా ఏలకుల సాగు పెంపొందించడమే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా మన్యం ప్రాంత రైతులకు ప్రత్యామ్నాయ లాభదాయక పంటలను అందుబాటులోకి తెచ్చే దిశగా జిల్లా యంత్రాంగం కీలక అడుగు వేసింది. గిరిజన ప్రాంతాల్లో రైతులకు అదనపు ఆదాయం అందించే లక్ష్యంతో కాఫీ తోటల్లో అంతర్ పంటగా 'ఏలకుల (Cardamom) ప్రయోగాత్మక సాగు' (Feasibility Trials) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ మంగళవారం ఉదయం పాడేరు మండలం గొండెలి పంచాయతీ పరిధిలో తురాడ అంజలి నాయుడు కాఫీ తోట కాళీ ప్రదేశం లో జిల్లా కలెక్టర్ అధికారికంగా స్ప్రైస్ బోర్డ్ అధికారులు,వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి (యాలికల) మొక్కలను నాటి ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో భారతీయ సుగంధ ద్రవ్యాల బోర్డు (Spices Board of India) శాస్త్రవేత్తలు, జిల్లా ఉద్యాన శాఖ, కాఫీ బోర్డు అధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (FPO) ప్రతినిధులు, స్థానిక గిరిజన రైతులు పాల్గొన్నారు. ఈ మొక్కలు నాటిన అనంతరం శాస్త్రవేత్తల రైతులకు పలు మార్గదర్శకాలను, అవగాహన కల్పించి, మట్టి తయారీ జీవ పరిమాణాలు, ఘనజీవామృతం, సేంద్రీయ ఎరువులతో మట్టిని సిద్ధం చేయడం, వేరు వ్యవస్థ బలంగా ఎదిగేలా విత్తన, నారు శుద్ధి చేసే విధానాలపై రైతులకు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. ఈ విత్తన శుద్ధి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రైతులతో స్వయంగా మాట్లాడి విత్తన శుద్ధి వివరాలపై అడిగి తెలుసుకున్నారు. కాఫీ తోటల్లో అంతర్ పంటవల్ల అరబికా కాఫీ తోటల్లో లభించే 50% నుండి 60% పాక్షిక నీడ (Filtered Sunlight) ఏలకుల పంట అభివృద్ధికి అత్యంత అనుకూలమని స్ప్రైస్ బోర్డ్ శాస్త్రవేత్తలు తెలియజేశారు. నీటి యాజమాన్యం, వేసవి కాలంలో తేమ శాతాన్ని కాపాడుకునేందుకు మైక్రో-ఇరిగేషన్, స్ప్రింక్లర్లు, హోస్ పైపులు, మరియు చిన్న పాటి చెక్ డ్యామ్ల నిర్మాణం అవసరమని సూచించారు.

ఈ పంట వల్ల అధిక లాభం, అధిక మార్కెట్ విలువలు,ఏలకులను 'సుగంధ ద్రవ్యాల రాణి' (Queen of Spices) గా పిలుస్తారని, గ్రేడును బట్టి, యాలకల సైజును బట్టి మార్కెట్లో కిలో ధర రూ. 3,000 నుండి రూ. 6,000 వరకు పలుకుతోందని కలెక్టర్ తెలిపారు. సేంద్రీయ పద్ధతుల్లో పండించడం ద్వారా గిరిజన రైతులకు నేరుగా అధిక ఆదాయం చేకూరుతుందని పేర్కొన్నారు.

జిల్లాలోని వాతావరణం, ఉష్ణోగ్రతలు ఏలకుల సాగుకు ఎంతో అనుకూలంగా ఉన్నాయని, ఈ ప్రయోగాత్మక సాగు విజయవంతం ద్వారా జిల్లాను ప్రత్యేక సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దుతామని, ఈ జిల్లా కు అరకు కాఫీ కి ఎంతో పేరుంది అలాగే ఏలకుల సాగులో మోడల్ జిల్లాగా తీర్చిదిద్దామని తద్వారా రైతులకు అధిక లాభం చేకూరుస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ప్రైస్ బోర్డ్ శాస్త్రవేత్తలు కర్ణాటక నుండి ఎస్ కుమార, కేరళ నుండి కేఏ సాదు, జిల్లా వ్యవసాయ అధికారి నందు, అదనపు వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, స్ప్రైస్ బోర్డ్ అధికారిని కళ్యాణి, ఉద్యానవన సంఘ అధికారి శరణ్య, తహశీల్దార్ శ్రీనివాసరావు,మండల అభివృద్ధి అధికారి రమేష్, కాఫీ బోర్డ్ ఏఈఓ సుధీర్, సురేష్, ఐటిడిఏ కాఫీ బోర్డ్ సిబ్బంది, ఏపీ సీఎం అఫ్ సిబ్బంది, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేస్తున్న ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్



**చెన్నై, ఆగష్టు 11 :** కోలీవుడ్ కథానాయకుడు ధనుష్ రాజకీయాల్లోకి రానున్నట్లు వార్తలు వస్తున్న అంశం పాఠకులకు విదితమే. ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆయన ఇటీవల తన అభిమానులకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ధనుష్ అభిమాన సంఘం 'ఆల్ ఇండియా ధనుష్ ఫ్యాన్స్ అసోసియేషన్'.. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పరిధిలో ఐదు నియోజకవర్గాల్లో కొత్త సంక్షేమ సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఫ్యాన్ క్లబ్ నాయకులు పిలుపునిచ్చారు. గతంలో విజయ్ వంటి నటులు కూడా తమ రాజకీయ ప్రయాణానికి ముందు అభిమాన సంఘాల ద్వారానే నియోజకవర్గాల వారీగా బలమైన కేడర్ ను నిర్మించుకున్నారు. ఇప్పుడు ధనుష్ కూడా అదే తరహాలో నియోజకవర్గాల వారీగా సంక్షేమ సంఘాల విస్తరణకు ఆదేశాలు ఇవ్వడంతో ఆయన త్వరలోనే పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం ఖాయమని వార్తలు వైరల్ అవుతున్నాయి.

## శిథిలావస్థలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్




ఏలేశ్వరం, ఆగస్టు,11:-(మనం న్యూస్ ): పట్టణంలో స్థానిక దిబ్బలపాలెంలో స్థానిక సాయి నగర్ లో విద్యార్థిని,విద్యార్థులు హై స్కూల్ కి,డిగ్రీ కాలేజీకి వెళ్లే దారిలో అక్రమంగా రోడ్డుపై నిర్మించిన ట్రాన్స్ఫార్మర్ శిథిలావస్థకు చేరుకొని ప్రమాద ఘంటికలు మోగిస్తోంది.ఇప్పటివరకు సరైన వర్షాలు లేక కానీ, మంచి వర్షాలు కాని కురిసి ఉంటే, ఈపాటికి ఈ ట్రాన్స్ఫార్మర్ కూలిపోయి, దగ్గర్లో ఉన్న కరెంటు స్తంభాలను కూల్చివేసి ఎన్నో ప్రమాదాలకు కారణం గా మిగిలి ఉండును.ఈ దారిన ఎక్కువగా విద్యార్థిని విద్యార్థులు తిరిగే మార్గం కాబట్టి భయభ్రాంతులతో నడిచి వెళ్తున్నారు. అయితే ఈ ట్రాన్స్ఫార్మర్ను నిలబెట్టడానికి కాంట్రాక్టు తీసుకున్న కాంట్రాక్టర్ పక్కన గవర్నమెంట్ స్థలం ఉన్నప్పటికీ, తన సౌలభ్యం కోసం రోడ్డుపై నాసిరకమైన మెటీరియల్ తో నిర్మించడంతో ట్రాన్స్ఫార్మర్ కు ఈ దుస్థితి వచ్చింది.దీనిపై ఎలక్ట్రికల్ ఏఈ సూర్యనారాయణ ని వివరణ అడగగా, ట్రాన్స్ఫార్మర్ విషయం తమ దృష్టికి వచ్చిందని,దాంతో కాంటాక్ట్ కాంట్రాక్టర్ ను నియమించామని,త్వరలోనే ఆ సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు.కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టే లోగా ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

## ఘనంగా సత్యదేవుని 136వ సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం

**అన్నవరం, ఆగస్టు 11, మనం న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం రత్నగిరిపై కొలువై ఉన్న శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి 136వ సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం (జయంతి) వేడుకలను ఈ నెల 13, 14 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు, వైదిక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజుల పాటు పలు వైదిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**13న వైదిక కార్యక్రమాలకు శ్రీకారం**

శ్రావణ శుద్ధ పాడ్యమి, గురువారం (ఆగస్టు 13) ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం నిర్వహిస్తారు. అనంతరం శ్రీ స్వామివారి గర్భాలయంలో కలశ స్థాపన, వేద పారాయణాలు, జపాలు, మండపారాధనలు, నవగ్రహ మరియు



మూలమంత్ర జపాలు, చండీ పారాయణం, సూర్య నమస్కారాలు, లింగార్చన, అశ్వత్థ ప్రదక్షిణ వంటి పలు వైదిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించి, అనంతరం నివేదన, నీరాజనం, మంత్రపుష్పం తదితర వైదిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

**14న సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం**

శ్రావణ శుద్ధ విదియ, శుక్రవారం (ఆగస్టు 14) స్వామివారి 136వ సత్యవిదియ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెల్లవారుజామున శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకవార పంచామృత అభిషేకం, మఖా నక్షత్ర అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం జపాలు, పారాయణాలు, నవగ్రహ హోమాలు, మూలమంత్ర హోమాలు, ఆయుష్య హోమం వంటి కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఉదయం 11 గంటలకు పూర్ణాహుతితో వైదిక కార్యక్రమాలు ముగియనున్నాయి.

## లైన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



- సీఐ బి. సూర్య అప్పారావు
- ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణులకు ఉచిత పౌష్టికాహార పంపిణీ

**ప్రత్తిపాడు ఆగస్టు 11 మనం న్యూస్:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం స్కానింగ్ కోసం వచ్చిన సుమారు 70 మంది గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. జేఎన్టీయూ పూర్వ విద్యార్థి, ఈఈ శ్రీ కె. వేణుగోపాల్ సౌజన్యంతో ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. సూర్య అప్పారావు హాజరై గర్భిణులకు పౌష్టికాహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భవిష్యత్తులో పిల్లల పెంపకంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో మంచి ప్రవర్తన, నడవడికను పెంపొందిస్తూ సమాజంలో వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులదేనని పేర్కొన్నారు. ఈ సేవా కార్యక్రమం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, వచ్చే నెలలో జరిగే పౌష్టికాహార పంపిణీ కార్యక్రమానికి స్వయంగా తానే స్పాన్సర్గా వ్యవహరిస్తానని సభాముఖంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దివ్య స్రవంతి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ నెంబరు వెలుగుల నాని, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఇంజనీర్ లయన్ మోహన్, ట్రెజరర్ లయన్ చలంకూరి కృష్ణమూర్తి, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ రమేష్ రాజులతో పాటు లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోపిరాజు, ఇందన ఏసుబాబు, రెడ్డి నాయుడు, గోళ్ళ నాగేశ్వరరావు, కె. సంజీవరావు, గొంప రామకృష్ణ, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రిలోని భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**తాడిపత్రి , ఆగస్టు 11 : మనం న్యూస్ :** తాడిపత్రి ప్రాంతంలోని పలు గ్రామాల పరిధిలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పర్యటించి, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం తాడిపత్రి మండలంలోని తలారిచెరువు మరియు ఊరిచింతల గ్రామాల పరిధిలో 'నెడ్ క్యాప్' ఆధ్వర్యంలో విండ్ మిల్స్ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదించిన భూములను జెసి పరిశీలించారు. అనంతరం ఎర్రగుంటపల్లె పరిధిలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్ నిర్మాణం కోసం కేటాయించిన భూమిని జెసి పరిశీలించారు. తదనంతరం మండలంలోని అయ్యవారపల్లి గ్రామ పరిధిలో రీ-సర్వేలో భాగంగా జరుగుతున్న 'గ్రౌండ్ ట్రూథింగ్' పనులను పరిశీలించి, అధికారులకు జాయింట్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్, స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## హెచ్.ఎల్.సి ద్వారా వస్తున్న నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలి



- అక్రమంగా నీటిని వాడుకుంటే కఠిన చర్యలు
- హెచ్.ఎల్.సి కాలువ వెంబడి నిరంతర నిఘా కోసం రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్ లతో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**కణేకల్ ఆగస్టు 11 మనం న్యూస్:** హెచ్.ఎల్.సి కాలువ ద్వారా వస్తున్న నీటిలో త్రాగునీటి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, నీటిని త్రాగునీటి అవసరాలకు మాత్రమే వాడుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హెచ్.ఎల్.సి (హెచ్ ఎల్ సి ) కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర అవసరాలకు వినియోగించడానికి వీల్లేదని, కేవలం త్రాగునీటి అవసరాల కోసమే ఈ నీటిని తరలిస్తున్నామని స్పష్టం చేశారు. రైతులు ఈ అంశాన్ని గమనించి సహకరించాలని కోరారు. కాలువ వెంట అక్రమంగా నీటిని తోడుకోవడం, బోర్ల ద్వారా లేదా పైప్లైన్ల ద్వారా నీటిని మళ్లించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.హెచ్.ఎల్.సి కాలువ వెంట నిరంతరం నిఘా ఉంచేందుకు ఇరిగేషన్, పోలీస్ మరియు రెవెన్యూ శాఖలతో పర్యవేక్షణ కోసం ప్రత్యేక బృందాలను (స్పెషల్ టీమ్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా నీటిని అక్రమంగా తరలిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బీసీల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి



- మంత్రి సవిత, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు ఆగష్టు 11 ( మన న్యూస్ ):** పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్ రోడ్డు వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సవిత, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, కార్మిక శాఖ బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది కొత్త గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల ఏర్పాటుకు సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు కృతజ్ఞతలు తెలిపారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో విద్యారంగం అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించలేదని, ప్రస్తుతం నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో నూతన మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన దుస్తులతో పాటు డొక్కా సీతమ్మ పథకం ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు తెలిపారు.

తక్కువ వ్యవధిలోనే మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ప్రారంభానికి సహకరించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, సంబంధిత అధికార యంత్రాంగానికి మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.

## ఏలేశ్వరంలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ



**ఏలేశ్వరం,ఆగస్టు 11(మనం న్యూస్ ):** అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు మరింత నాణ్యమైన ప్రాథమిక విద్య,పోషణ,ఆరోగ్యం,రక్షణ సేవలు అందించేందుకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఏలేశ్వరం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణలో చిన్నారుల సమగ్ర అభివృద్ధి,ఆటల ద్వారా అభ్యాసం,బోధనా సామగ్రి వినియోగం,పాఠశాల సంసిద్ధత, ఆరోగ్యం-పోషణ,బాలల రక్షణ తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్నారు.ఈ సందర్భంగా ఏలేశ్వరం పట్టణ నాయకులు బొదిరెడ్డి గోపి,మూది నారాయణస్వామి తదితరులు పాల్గొని మాట్లాడారు.అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2 వరలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు,శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపితే.. జైలుకే...!



**గోరంట్ల, ఆగస్టు 11, మనం న్యూస్:** మద్యం మత్తులో వాహనం నడుపుతూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే వారిపై గోరంట్ల పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి కళ్లెం వేసేందుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ఆన్ డ్రంక్ అండ్ డ్రైవింగ్లో పట్టుబడిన ఓ వ్యక్తికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. గోరంట్ల సీఐ శేఖర్ ఆదేశాల మేరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో సోమందేపల్లి మండలం పెట్టకుంట గుడిపల్లి గ్రామానికి చెందిన ఎస్. నరసింహమూర్తి (30) మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. ఈ మేరకు అతనిపై క్రైం నంబర్ 184/2026, ఎంవీ యాక్ట్ సెక్షన్ 185 కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా మంగళవారం (ఆగస్టు 11) గౌరవ రెండో తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు, పెనుకొండ న్యాయమూర్తి శ్రీమతి పి. అనుపమ ముద్దాయికి మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా గోరంట్ల సీఐ శేఖర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా ప్రమాదాలకు కారణమయ్యే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని, మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారికి కేసుతో పాటు కోర్టు ద్వారా జైలు శిక్ష, జరిమానా రెండూ విధించేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మద్యం తాగి వాహనం నడపడం సరదా కాదు.. అది ప్రాణాలతో చెలగాటం. వాహనం నడిపే ముందు మద్యం మానుకోవాలి అని సీఐ సూచించారు. కోర్టు పోలీస్ కానిస్టేబుల్ ఎస్. హుస్సేన్ బాషా కేసు విచారణ ప్రక్రియలో పాల్గొన్నారు

## నేతన్న నేస్తంలో అనర్హులకు అందలం




- భారీ స్థాయిలో అవినీతి పై ధర్నా..

**సోమందేపల్లి టౌన్ ఆగస్టు 11 మనం న్యూస్:** ఇటీవలకూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నేతన్న నేస్తం పథకం సోమందేపల్లి మండలంలో అబాసు పాలైనట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 71 వేల మందికి పైగా చేనేతలకు రూ 25 వేలు చొప్పున లబ్ధి అందివ్వడం జరిగింది. అయితే సోమందేపల్లి మండలంలో చేనేత మగ్గం ఉన్నవారు 100 నుండి 150 లోపలే.

ఈ నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం వారు చేనేత కార్మికుల కుటుంబాలకు నేత మగ్గం ఉన్నవారికి 200 ల యూనిట్లు, మరమగ్గం ఉన్న ఇళ్లకు 500 యూనిట్ల చొప్పున విద్యుత్ సబ్సిడీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో సోమందేపల్లి మండల వ్యాప్తంగా సుమారు 210 నేత కార్మికులు ఉన్న ఇళ్లకు మాత్రమే విద్యుత్తు ప్రతినెల సబ్సిడీ కింద వస్తోంది. అదే సమయంలో నేతన్న నేస్తం పథకం వర్తింపు సమయానికి ఎనిమిది వందల పదిమందికి పైగా లబ్ధిదారులు ఉన్నట్లు వారికి రూ 25 వేలు చొప్పున లబ్ధి అందివ్వడం 3జరిగింది. ఈ సందర్భంగా సోమందేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాలు, చేనేత కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. నేతన్న సేవ పథకంలో అర్హత ఉన్న నిజమైన చేనేత కార్మికులకు లబ్ధి చేకూరలేదని కార్మికులు ఆరోపించారు. అర్హత ఉన్న ప్రతి చేనేత కార్మికుడికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అర్హుల జాబితాను పారదర్శకంగా పునఃపరిశీలించి, అన్యాయం జరిగిన కార్మికులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు.

## ధర్మవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'జ్ఞానజ్యోతి' శిక్షణ ప్రారంభం..



**ప్రత్తిపాడు ఆగస్టు 11 మనం న్యూస్:** చిన్నారుల సమగ్ర వికాసానికి, వారి శారీరక, మానసిక అభ్యున్నతికి అంగన్వాడీ కార్యకర్తల సేవలు అభినందనీయమని కూటమి నాయకులు అన్నారు. ప్రత్తిపాడు ఐసీడీఎస్ సిడిపిఓ టీడీఆర్ పద్మావతి ఆధ్వర్యంలో మండలం ధర్మవరం గ్రామంలో ఏర్పాటు చేసిన 6 రోజుల 'జ్ఞానజ్యోతి' శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్ వరలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక కూటమి నాయకులు సొసైటీ చైర్మన్ దాసం శేషారావు,బొల్లు కొండబాబు, దాట్ల అప్పన బాబు, బిజెపి జిల్లా నేత సింగిలిదేవి సత్తిరాజు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ 6 రోజుల శిక్షణలో నేర్చుకున్న నూతన బోధనా పద్ధతులు, సూచనలను అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందించి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ఎం మూర్తి ఉపాధ్యాయులు గణేష్, రమణ, రోహిణిలతో పాటు పలువురు అంగన్వాడీ కార్యకర్తలు, ఆయా ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి వేళ ఎస్పీ ఆకస్మిక తనిఖీలు



**ధర్మవరం ఆగస్టు 11 మనం న్యూస్:** రాత్రివేళల్లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్కుమార్ ఐపీఎస్ ఆదేశించారు. సోమవారం అర్ధరాత్రి ఆయన కొత్తచెరువు, ధర్మవరం వన్టౌన్ పోలీసుస్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, నైట్బీట్, పెట్రోలింగ్, వైర్లెస్ కమ్యూనికేషన్, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాన్ని పరిశీలించారు.అనంతరం ధర్మవరం కాలేజీ సర్కిల్, ప్రధాన రహదారులు, బీట్ పాయింట్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి పోలీసుల గస్తీ, పెట్రోలింగ్ వాహనాల కదలికలను తనిఖీ చేశారు. రాత్రివేళల్లో సంచరిస్తున్న వ్యక్తులు, వాహనాల వివరాలను తెలుసుకుని అనుమానాస్పద కదలికలపై పోలీసుల నిఘాను సమీక్షించారు.ప్రధాన రహదారులు, వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ఏటీఎంలు, దేవాలయాలు తదితర ప్రాంతాల్లో నైట్బీట్, పెట్రోలింగ్ను మరింత పటిష్టం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## మత్తు వ్యసనాలకు బానిస కావొద్దు

- ఆరోగ్యకరమైన జీవనమే ముద్దు

**కనేకల్, ఆగస్టు 11 మనం న్యూస్:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని కనేకల్ పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ నాగ మధు సూచించారు.కనేకల్ క్రాస్ లోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులం లో మంగళవారం ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ నాగ మధు మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు విద్యాభ్యాసం, మానసిక స్థితి, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ వినియోగం, రవాణా, విక్రయాలకు పాల్పడితే ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై కూడా విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా, వాటికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు.

గురుకుల వైస్ ప్రిన్సిపాల్ ఎం. విజయభాస్కర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన పెంపొందించడంలో ఈగల్ క్లబ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.మాదకద్రవ్యాలకు వ్యతిరేకం గా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆరాధన ఉత్సవాలకు హాజరు కావాలని కర్ణాటక సీఎం, మాజీ సీఎంలకు ఆహ్వాన పత్రికలు అందజేత



మంత్రాలయం ఆగస్టు 11,మనం న్యూస్ : ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగే సప్తరాత్రోత్సవాలకు హాజరు కావాలని కోరుతు పీఠాధిపతి ఆదేశానుసారం శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్/ పీఆర్వో ఐపీ నరసింహ మూర్తి స్వామి బెంగళూరు లోని కర్ణాటక సీఎం డీకే. శివకుమార్, మాజీ సీఎం సిద్దరామయ్య లకు వేర్వేరు సమయాల్లో ఆహ్వాన పత్రికలను అందజేశారు.

## అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయరాదు




మంత్రాలయం , ఆగస్టు 11,మనం న్యూస్ ;- అధిక నీటి అవసరం ఉన్న పంటలను సాగు చేయరాదని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా శివరామకృష్ణ, డా నసీరుద్దీన్, డా చైతన్య, డా జయలక్ష్మి, డా ఇషా పర్వీన్, డా సతీష్ బాబు మరియు డా రమదేవీ , మంత్రాలయం మండల వ్యవసాయాధికారి జీరాగణేష్ లు రైతులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని సూగురు గ్రామంలో ఎల్ నినో నేపథ్యంలో రైతులకు ఎల్ నినో అవగాహన మరియు క్షేత్ర సందర్శన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి అధిక నీటి అవసరం ఉన్న వరి, మొక్కజొన్న పంటలను సాగు చేసుకోరాదని, మరియు ఆరుతడి పంటలు అయినా కంది, సజ్జ, మినుము, ప్రొద్దు తిరుగుడు మరియు కొర్రలు సాగు చేసుకోవాల్సింది గా సూచించారు. వివిధ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం తేమ సంరక్షణ పద్ధతుల పై రైతులకు లు అవగాహన కల్పించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డా శివరామకృష్ణ, డా నసీరుద్దీన్, డా చైతన్య, డా జయలక్ష్మి, డా ఇషా పర్వీన్, డా సతీష్ బాబు మరియు డా రమదేవీ రైతులకు తెలిపారు. ప్రతి ఒక్క రైతు పంట బీమా చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, తిరుమల రెడ్డి, వ్యవసాయ సిబ్బంది శాంతి రాజు ,వీఏఏలు మాదన్న మరియు రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

- రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్ గుప్తా
- తల్లి, శిశు ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు, ఆగస్టు 11మనం న్యూస్ : గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు 102 తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఆహార శుద్ధి శాఖ మంత్రి టి.జి. భరత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 500 నూతన వాహనాలను ప్రారంభించగా, కర్నూలు జిల్లాకు 27 వాహనాలు కేటాయించినట్లు తెలిపారు. మంగళవారం కర్నూలు నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణంలో 102 తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనాలను జిల్లా కలెక్టర్, శాసనసభ్యులు, అధికారులతో కలిసి మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గర్భిణులకు అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో ఆసుపత్రికి తరలించడం, ప్రసవానంతరం తల్లి, బిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడంలో 102 సేవలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. నూతన వాహనాల్లో ఏసీ సదుపాయంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఆధునిక సాంకేతిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తల్లి, బిడ్డల సురక్షిత ప్రయాణంలో వాహనాల 'కెప్టెన్లు' కీలక పాత్ర పోషిస్తున్నారని మంత్రి అభినందించారు. కర్నూలు జిల్లాకు కేటాయించిన 27 వాహనాలను అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచి, మారుమూల ప్రాంతాల నుంచి గర్భిణులు, బాలింతలకు సకాలంలో రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రజలకు అత్యవసరమైన వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తూ నిధులు, వనరులను సమకూరుస్తున్నామని పేర్కొన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, భవనాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు అవసరమైన చోట సీఎస్ఆర్ నిధుల సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పాత భవనాల బలోపేతం, వాటర్ప్రూఫ్ స్లాబ్ల ఏర్పాటు వంటి పనులకు ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పటివరకు సుమారు 21 భవనాలకు సంబంధించిన అభివృద్ధి, బలోపేత పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఆసుపత్రిలో వెంటిలేటర్లు, ఇతర అవసరమైన వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కర్నూలు పాత నగరంలోని గడియారం ఆసుపత్రిని తిరిగి వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. గతంలో మహిళలకు ప్రసవ సేవలు అందించిన ఈ ఆసుపత్రిని ఆధునిక అవసరాలకు అనుగుణంగా పునరుద్ధరించి, అందుబాటులోకి తీసుకురావడానికి ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన వైద్యశాల జిల్లాకు అత్యంత కీలకమైన వైద్య సంస్థలని మంత్రి పేర్కొన్నారు.

క్లిష్టమైన కేసులకు కూడా వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది సేవలను అభినందించారు. ఈ సంస్థలను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అత్యవసర అంశాలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల అవసరాలు, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజల సంక్షేమం, ఆరోగ్యం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి టి.జి. భరత్ తెలిపారు.

**తల్లి, శిశు ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు – జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..కర్నూలు జిల్లాలో తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ సేవలు మరింత బలోపేతం చేయడం ద్వారా హైరిస్క్ గర్భిణులు, ప్రసవానంతర తల్లులు, నవజాత శిశువులకు సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను అర్హులైన ప్రతి గర్భిణి, ప్రసవానంతర మహిళ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కర్నూలు జిల్లాకు ఇప్పటికే 27 తల్లి-బిడ్డ ఎక్స్ప్రెస్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయని, మరో 17 వాహనాలు త్వరలో జిల్లాకు రానున్నాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా రక్తహీనత, అధిక రక్తపోటు, మధుమేహం తదితర సమస్యలతో హైరిస్క్లో ఉన్న గర్భిణులకు ఈ వాహనాల ద్వారా పికప్, డ్రాప్ సౌకర్యాలతో పాటు ప్రసవానంతర రవాణా సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కామేశ్వర ప్రసాద్, జిల్లా జనసేన అధ్యక్షులు సురేష్, జిజిహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు

# కర్నూలు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- దేవనగర్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
- పరిశ్రమలతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- మంత్రి టీజీ భరత్



కర్నూలు ఆగస్ట్ 11మనం న్యూస్‌: 25వ వార్డు దేవనగర్లో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తైన సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కర్నూలు జిల్లాకు పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని చెప్పారు. దేవనగర్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నిర్మాణ దశలో ఉండి నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో కమ్యూనిటీ హాల్ను కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు యాదవ్, నగర అధ్యక్షుడు రవి, వార్డు ఇంచార్జి రాజశేఖర్ యాదవ్, బూత్ ఇన్చార్జి పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయ నిధి

- మంత్రాలయం టీడీపీ బాధ్యులు రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం , ఆగస్టు 11,మనం న్యూస్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల ఆరోగ్యానికి అండగా నిలుస్తోందని మంత్రాలయం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని తెదేపా కార్యాలయంలో కొత్తగా 18వ విడతగా 83 మందికి రూ.47.37 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను మంత్రాలయం సొసైటీ చైర్మన్ రామకృష్ణ రెడ్డి యువనాయకులు ఎన్.రాకేష్ రెడ్డి రాజారెడ్డి తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,రాష్ట్ర భవిష్యత్తు , పేద ప్రజలను సొంత కుటుంబ సభ్యులుగా భావించి, ఆపద సమయంలో అండగా నిలిచేలా సీఎం సహాయనిధిని అందిస్తున్నారు.మన నియోజకవర్గంలో ఏ కుటుంబానికైనా అనారోగ్య సమస్య వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదురైతే సమస్యను నా దృష్టికి తీసుకువస్తే మీకు వీలైనంత వరకు, ప్రభుత్వ సహాయాన్ని అందేలా చేసి ప్రతి కుటుంబానికి అండగా నిలబడేందుకు నేను



ఎప్పుడూ ముందుంటాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు,ప్రజాప్రతినిధులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిలు, గ్రామ అధ్యక్షులు టీడీపీ, ఐటీడీపి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వసతి గృహాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి



మహానంది, ఆగస్టు11,మనంన్యూస్‌: మహానంది పుణ్యక్షేత్రం లో నూతనంగా నిర్మాణం చేపడుతున్న వసతి గృహాల నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ఈఓ శ్రీనివాస రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్ కు చెందిన సుబ్రహ్మణ్యం, సంధ్యారాణి దంపతులు సూట్ రూమ్ నిర్మాణానికి 15 లక్షల రూపాయల చెక్ ను అందజేశారు. అలాగే కూకట్ పల్లి కి చెందిన సురేష్ బాబు, లలితాదేవి దంపతులు ఒక గది నిర్మాణానికి 10లక్షల రూపాయల కు గాను అడ్వాన్స్ గా 2లక్షల 50 వేలు అందించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను శేష వస్త్రాల తో సన్మానించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ ఈఓ మధు, ఉప ప్రధాన అర్చకులు శివ శంకరయ్య శర్మ, ముఖ్య అర్చకులు మాణిక్య శర్మ, మణికంఠ శర్మ, పాల్గొన్నారు.

## రాఘవేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలకు అధికారులు సహకరించాలి



- శ్రీ మఠం ఏఏఓ మాధవ శెట్టి మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు

మంత్రాలయం , ఆగస్టు 11,మనం న్యూస్ ;- ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో జరుగనున్న శ్రీ రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల విజయవంతం చేసేందుకు అధికారులు సహకరించాలని శ్రీ మఠం ఏఏఓ మాధవ శెట్టి మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు వెంకటేష్ జోష్యి సురేష్ కోనాపూర్ ,పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్ అప్రమేయచార్ లు కోరారు. మంగళవారం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన మహోత్సవాల ఏర్పాట్ల లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనే సంకల్పంతో పని చేయాలని సూచించారు.

## ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎరిగేరి హై స్కూల్ విద్యార్థుల ఘన విజయం

- విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయులు కృషికీ తోడైతే విజయాలు సొంతమవుతాయి
- హెచ్.ఎం.రమేష్ నాయుడు

కౌతాళం,ఆగస్టు 11 మనం న్యూస్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎరిగేరి విద్యార్థులు డిసెంబర్ 2025లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్) పరీక్షలో అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.రజత,యు.నిఖిల్, ఎం.అజయ్ ముగ్గురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్కు ఎంపికయ్యారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు సంవత్సరానికి 12,000 రూపాయలు చొప్పున స్కాలర్షిప్



లభిస్తుంది.ఈ విజయం విద్యార్థుల ప్రతిభకు, ఉపాధ్యాయుల కృషికి మరియు తల్లిదండ్రుల సహకారానికి నిదర్శనంగా నిలిచింది. విద్యార్థుల విజయానికి ప్రత్యేకంగా కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మరియు సైన్స్ ఉపాధ్యాయులు అదేవిధంగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సహకరించిన ఇతర ఉపాధ్యాయులను, విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రమేష్ నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ శ్రీరాములు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రామలింగ, బసవరాజు,గిడ్డయ్య, చంద్రశేఖర్ తదితరులు విద్యార్థులను,వారి తల్లిదండ్రులను మరియు ఉపాధ్యాయులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయుల కృషి తోడైతే విజయాలు సొంతమవుతాయి అనే సందేశాన్ని ఎరిగేరి జడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ఎన్ఎంఎంఎస్ విజయం చాటిచెప్పింది.

## ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



దేవనకొండ, ఆగస్టు 11, ( మనం న్యూస్ ): పంట పొలాల్లో పంటలు వేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని వ్యవసాయ అధికారిని ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండ్లకొండ, చెల్లెలా చెలిమల గ్రామాల్లో ₹పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఆ. ఉష రాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ, ఆముదము, కంది పంటలకు రసం పీల్చే పురుగులు మరియు లద్దె పురుగులు తాకిడి ఎక్కువ ఉంటుందన్నారు. అలాగే పంటలు వేసిన ప్రతి రైతు కూడా పంట నమోదు ఎవరైనా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టని వారు ఉంటే ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఏఈఓ మల్లికార్జున, గ్రామ వ్యవసా య సహాయకులు మోహన్ గౌడు, వినయ్ కుమార్,జ్యోతి మరియు రైతులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం



నందవరం ఆగస్టు 11 మనం న్యూస్‌: నందవరం మండల పరిధిలోని స్థానిక మాచాపురం గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ కాసింవలి అధ్వారణంలో గ్రామంలో టిడిపి పెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ టిడిపి మండల కన్వీనర్ ఖాసింవలి మార్కెట్ చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి వి జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పథకాలు సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని ప్రజలకు తెలియజేశారు

మాచాపురం గ్రామంలో టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

టీడీపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. గ్రామంలో పార్టీకి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## పాలకుల వైఫల్యాలపై తిరగబడుదాం: సిపిఐ

కర్నూలు ఆగస్ట్ 11మనం న్యూస్ : ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న పాలకుల వైఫల్యాలపై తిరగబడి పోరాడి సాధించుకుందామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ లెనిన్ బాబు, నగర కార్యదర్శి రామకృష్ణ రెడ్డి లు పిలుపునిచ్చారు సిపిఐ దేశవ్యాప్త ప్రచార పాదయాత్రలో భాగంగా కర్నూల్ నగరంలో 6వ రోజు 38వ వార్డులోని మాస మసీద్, మామిదాలపాడు ఏరియాలో ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి నగర కార్యవర్గ సభ్యులు వి నాగరాజు అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న లెనిన్ బాబు రామకృష్ణారెడ్డి లో మాట్లాడుతూ 12 సంవత్సరాల బిజెపి పాలనలో నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగి సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు




ఎదుర్కొంటున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు లేక నిరుద్యోగం పెరిగిపోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సి మహేష్ జి చంద్రశేఖర్ డి శ్రీనివాసరావు ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసులు, నగర కార్యదర్శి బిసన్న ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి అశోక్, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు నల్లన్న, అన్వర్, శ్రీకాంత్, ప్రభాకర్, ప్రసాదు, అశోకు, మునెమ్మ, ఆశ బేగం, ప్రజానాట్యమండలి నాయకులు డప్పు మాణిక్యం, శివ, బద్రి మహేష్ మల్లి తదితరులు పాల్గొన్నారు.

## రమణీయం శ్రీ రాఘవేంద్రుడి స్వర్ణ పల్లకోత్సవం

- స్వర్ణ పల్లకిలో మృతిక బృందావనం

మంత్రాలయం , ఆగస్టు 11 (మనం న్యూస్) : ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం లో సోమవారం శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనం అర్చకులు జయతీర్థ స్వామి, వేదవ్యాస స్వామి,సహాయ పీఆర్వో హొన్నళ్ళి వ్యాసరాజ్ ఆచార్ ఆధ్వర్యంలో వృత్తికా బృందావనాన్ని స్వర్ణ పల్లకి లో ఉంచి అశేష భక్తుల నడుమ, భాజా భజంత్రీలు , మంగళ వాయిద్యాల మధ్య , శ్రీ రాఘవేంద్ర నామస్మరణతో శ్రీ మఠం ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ప్రవచన మండపంలో బంగారు పల్లకి సేవ చేయించిన భక్తుల పేరు,గోత్ర నామాల పై సంకల్ప పూజలు నిర్వహించారు.సేవ చేయించిన భక్తులకు విశేష దర్శన భాగ్యం కల్పించారు.వీరికి శ్రీ మఠం



పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామీజి వారు శేష వస్త్రం, పుష్ప,ఫల, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మఠం దివాన్ శ్రీనాథ్ ఆచార్, సహాయ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, ధార్మిక అధికారి శ్రీపతి స్వామి,శ్రీ మఠం సెక్యూరిటీ ఇంచార్జీ రమేష్ స్వామి, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభం

మంత్రాలయం , ఆగస్టు 11,మనం న్యూస్ :- మండల కేంద్రమైన మంత్రాలయం ఆర్ఎస్ఎస్ ఎంపిపి పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమానికి ఎంఈఓ 2 రాఘున్న ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు ఏ విధంగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలనే అంశంపై అవగాహన కల్పించారు. జీరో నుండి మూడు సంవత్సరాల వరకు ఉన్న పిల్లలని నవచేతన అని, మూడు నుండి ఆరు సంవత్సరాల విద్యార్థులను ఆదర్శ శీల అని అంటారని శిక్షకులు వివరించారు.చిన్న పిల్లలకు ఆటల ద్వారా, కథల ద్వారా, బొమ్మల ద్వారా విద్యాబోధన చేయాలని, ఎల్ఎన్ఎస్ మెటీరియల్ అంటే భాష, గణితం, సైన్స్ కిట్లను ఉపయోగించి అక్షరాలు, సంఖ్యలు, రంగులు గుర్తింపు నేర్పించాలని సిఆర్పిలు ట్రైనింగ్ ఇచ్చారు. అలాగే పిల్లలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పిల్లల స్థాయికి తగ్గట్టు గ్రూప్ యాక్టివిటీస్, ప్లే వే మెథడ్ ద్వారా నేర్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు వీరగోవిందమ్మ, సుమిత్రమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం మూడురోజుల పాటు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

## మున్సిపల్ వర్కర్‌కు జనసేన పార్టీ అండ



దేవనకొండ మనం న్యూస్: మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో పనిచేస్తున్న మున్సిపాలిటీ వర్కర్ మాల మబ్బు రాముడు కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని జనసేన ఇంచార్జ్ తెర్నేకల్ వెంకప్ప పేర్కొన్నారు. మంగళవారం వర్కర్ అనారోగ్యంతో కర్నూల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న జనసేన ఇంచార్జ్ ఆయనకు ఆపరేషన్ కోసం వెంటనే 10, 000/- రూపాయలు ఆర్థిక సహాయం జనసేన నాయకులు లక్ష్మన్న దుబ్బ లచ్చి రామాంజనేయులు చిన్న రాముడు, పెద్దయ్య పరమాల నాగేష్, బోనాల తిమ్మప్పల చేతుల మీదుగా అందజేశారు. ఈ ఆర్థిక సాయం అందజేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## గుండె పోటుతో సూపర్‌వైజర్ మృతి

మహానంది, ఆగస్టు11,మనంన్యూస్‌: నంద్యాల జిల్లా, మహానంది మండల అంగన్వాడీ సూపర్వైజర్ తోట కవిత(45)గుండె పోటుతో మృతి చెందారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆమె మొదట అంగన్వాడీ టీచర్ గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై సూపర్వైజర్ గా పదవీ బాధ్యతలు చేపట్టింది. అందరితో ఆనందంగా ఉంటూ అంగన్వాడీ టీచర్ లను కలుపుకుని పోతూ విధులు నిర్వహిస్తూ ఎంతగానో పేరు సంపాదించుకుంది.



మంగళవారం తిమ్మాపురం గ్రామంలో వున్న మాడల్ పాఠశాలలో విధుల నిమిత్తం వెళ్లిన సమయంలో గుండె పోటుకు గురైంది. స్థానికులు, కుటుంబ సభ్యులు నంద్యాల లోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అతి చిన్న వయసులోనే ఆమె మృతి చెందడం బాధాకరమని స్థానికులు, అంగ న్వాడీ టీచర్ లు కన్నీటి పర్వతమయ్యారు. బుధ వారం అంత్యక్రియలు జరగనున్నట్లు తెలిసింది.



# టీమ్‌లోకి రమ్మంటే.. వద్దంటానా?: భువనేశ్వర్

టీమ్ఇండియాలో ఒకప్పుడు కీలక బౌలర్ గా ఉన్న భువనేశ్వర్ జట్టుకు దూరమై చాలా కాలమే అయింది. చివరగా 2022లో అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కానీ గత కొన్ని వారాలుగా అతడి గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. 2027 వన్డే ప్రపంచకప్ కోసం అతణ్ని తిరిగి భారత జట్టులోకి తీసుకోవాలని చాలా మంది క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భువి 2026 ఐపీఎల్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున విశేషంగా రాణించడం, భారత పేసర్లు గాయాల బారిన పడుతుండడం అందరి దృష్టి అతడివైపు మళ్లడానికి ప్రధాన కారణాలు. తనపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భువనేశ్వర్ స్పందించాడు. సెలక్టర్ల నుంచి పిలుపు అందితే టీమ్ఇండియాతో చేరడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాడు. ''సెలక్టర్ల నుంచి పిలుపు అందితే నేనెందుకు కాదంటా. టీమ్ఇండియాకు ఆడేందుకు నేను పూర్తి సిద్ధంగా ఉన్నా. నిజాయితీగా చెప్పాలంటే.. నేను ఎంత సిద్ధంగా ఉన్నానో చెప్పలేను. నా పని క్రికెట్ ఆడడం. అందుకే ఇప్పుడు యూపీ టీ20 లీగ్ లో ఆడడానికి వచ్చా. ఏదో స్థాయికి వెళ్లడానికి ఇక్కడికి రాలేదు. దేనికో ఎంపిక కావాలని లేదా ఎవరో ఏదో అన్నారని నేను యూపీ టీ20 లీగ్ లో ఆడేందుకు రాలేదు. నేను ఎంత సన్నద్ధంగా ఉన్నానన్నది చెప్పాల్సింది నేను కాదు. నిర్ణయం తీసుకోవాల్సింది సెలక్టర్లు'' అని భువనేశ్వర్ చెప్పాడు. 36 ఏళ్ల భువి.. ఈ నెల 14న మొదలయ్యే ఉత్తర్ ప్రదేశ్ టీ20 లీగ్ లో లఖ్‌నవూ ఫాల్కన్స్‌కు నాయకత్వం వహించనున్నాడు.

# విండీస్‌కు అఫ్గాన్ ఎఫెక్ట్.. వరల్డ్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్ కు దూరం



ఒకప్పుడు అద్భుతమైన విజయాలతో ప్రపంచ క్రికెట్ లో తిరుగులేని జట్టుగా వెలుగొందిన వెస్టిండీస్ ప్రభ కొన్నేళ్లుగా మసకబారుతోంది. గత వన్డే ప్రపంచ కప్ నకు నేరుగా అర్హత సాధించలేకపోయిన వెస్టిండీస్.. తర్వాత క్వాలిఫయర్స్ లోనూ పేలవ ప్రదర్శన చేసి టోర్నమెంట్ కు దూరమైంది. ఈ సారి కూడా విండీస్ అదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. సోమవారం ఐర్లాండ్ తో జరిగిన మూడో వన్డే మ్యాచ్ లో అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచ కప్ నకు నేరుగా అర్హత సాధించింది. దీంతో విండీస్ ఆశలు ఆవిరయ్యాయి.

వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసీసీ ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్ లైన్ విధించింది. టాప్-8లో నిలిచిన జట్లు నేరుగా వరల్ కప్ నకు క్వాలిఫై అవుతాయి. ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వేతో కూడా ఆటోమేటిక్ అర్హత సాధిస్తాయి. ఐర్లాండ్ పై విజయంతో అఫ్గాన్ టాప్-8లోకి దూసుకొచ్చింది. భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, పాకిస్థాన్, శ్రీలంక, ఇంగ్లాండ్, అఫ్గాన్, బంగ్లాదేశ్, జింబాబ్వే నేరుగా డైరెక్ట్ గా క్వాలిఫై అయ్యాయి. కటాఫ్ తేదీ నాటికి విండీస్ రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్ లో భారత్ తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా అఫ్గాన్ ను కరేబియన్ జట్టు వెనక్కినెట్టే అవకాశం లేదు.

వెస్టిండీస్ 2027 వరల్ కప్ లో ఆడాలంటే 10 జట్లతో జరిగే ప్రపంచ కప్ క్వాలిఫయర్స్ ఆడాల్సి ఉంటుంది. ఇందులో ఐర్లాండ్ తోపాటు క్రికెట్ వరల్ కప్ లీగ్-2లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన జట్లు, క్వాలిఫయర్ ప్లే ఆఫ్స్ నుంచి వచ్చిన జట్లు పాల్గొంటాయి. ఈ టోర్నీలో విండీస్ విజేతగా నిలిస్తే నేరుగా వరల్ కప్ గ్రూప్ దశలో తలపడుతుంది. ఒకవేళ రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిస్తే సూపర్ సిరీస్ లో తలపడాల్సి ఉంటుంది. అందులో అగ్రస్థానం దక్కించుకుంటే వరల్ కప్ లో చివరి బెర్తును ఖరారు చేసుకుంటుంది.

# ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అరెస్టు

ఢిల్లీ క్యాపిటల్స్ క్రికెటర్ అభిషేక్ పోరెల్ అరెస్టయ్యాడు. అత్యాచార ఆరోపణల కేసులో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. బెంగాల్ కు చెందిన అభిషేక్ పోరెల్ 2023లో ఐపీఎల్ లో అడుగుపెట్టాడు. ఢిల్లీ క్యాపిటల్స్ కు ప్రాతినిథ్యం వహిస్తున్న 24 ఏళ్ల ఈ లెఫ్టాండర్ బ్యాటర్.. ఇప్పటికి 35 మ్యాచ్ లు ఆడి 769 పరుగులు చేశాడు.

**పెళ్లి చేసుకుంటానని నమ్మించి..**



క్యాపిటల్స్ కీలక ప్లేయర్లలో ఒకడిగా ఎదిగిన అభిషేక్ పోరెల్ పై జూన్ లో అత్యాచార ఆరోపణలతో కేసు నమోదైంది. గత మూడేళ్లుగా తనతో రిలేషన్ షిప్ లో ఉన్న పోరెల్.. ఏడాది కాలంగా తనను దూరం పెట్టాడని వైద్య విద్యార్థిని ఆరోపించింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి అన్ని రకాలుగా వాడుకున్నాడని ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో తనపై అనేకమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడని.. తమ వ్యక్తిగత వీడియోలు రికార్డు చేసి ఇప్పుడు వాటిని చూపించి బెదిరిస్తున్నాడని బాధితురాలు తీవ్రమైన ఆరోపణలు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బెంగాల్ పోలీసులు తెలిపారు.

**హైకోర్టు ఆదేశాలతో..**

ఈ క్రమంలో అభిషేక్ పోరెల్ మొబైల్ ఫోన్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను వెంటనే సీజ్ చేయాలని కోల్ కతా హైకోర్టు ఆదేశించింది. అతడిని వెంటనే అరెస్టు చేయాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

ఈ నేపథ్యంలో డుమ్ డుమ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇమామి సిటీ పోలీసులు అభిషేక్ పోరెల్ను తాజాగా అరెస్టు చేసినట్లు సమాచారం. హూగ్లీ రూరల్ పోలీస్ ఎస్పీ కున్వార్ భూషణ్ సింగ్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

కాగా అభిషేక్ పోరెల్ గతంలో భారత్-ఎ క్రికెట్ జట్టు తరఫున యూకే, ఆస్ట్రేలియా గడ్డ మీద మ్యాచ్లు ఆడాడు. ఇదిలా ఉంటే.. తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని అభిషేక్ పోరెల్ కొట్టిపారేశాడు. కాగా బెంగాల్ తరఫున 2021-11 సీజన్ లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ లో అరంగేట్రం చేసిన అభిషేక్ పోరెల్.. 32 మ్యాచ్లు ఆడాడు. ఇక లిస్ట్-ఎ క్రికెట్లో అతడు 23 మ్యాచ్ లలో భాగమయ్యాడు.

# వరుస హిట్లతో ఫుల్ ఫామ్‌లో వామికా గబ్బీ..

## ఏకంగా బిగ్గెస్ట్ పాన్ ఇండియా మూవీలో చాన్స్!



బాలీవుడ్ యంగ్ బ్యూటీ వామికా గబ్బీకి 2026 సంవత్సరం బాగా కలిసివస్తోందనడంలో అతిశయోక్తి లేదు. అక్షయ్ కుమార్ 'భూత్ బంగ్లా' లో నటించి విజయం సాధించి జోరు అందుకున్న ఆమె, ఆ తర్వాత 'పతి పత్నీ ఔర్ వో 2', తమిళ చిత్రం 'డీసి: ది బ్లడీ వాలెంటైన్'లలో నటనతో మంచి ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు తన కెరీర్ లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారీ ప్రాజెక్ట్ లో అవకాశం దక్కించుకుని వార్తల్లో నిలిచింది. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో, కాంతార ఫేమ్ రిషబ్ శెట్టి హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మైథలాజికల్ మూవీ 'జై హనుమాన్'లో వామికా ఒక శక్తివంతమైన పాత్రకు ఎంపికైనట్లు సమాచారం.2024లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'హనుమాన్' సినిమాకి సీక్వెల్ గా రాబోతుంది. ఈ సినిమాలో రిషబ్ శెట్టి లార్డ్ హనుమాన్ పాత్రలో కనిపించబోతుండటం విశేషం. కలియుగం బ్యాక్ డ్రాప్ లో హనుమంతుడి భక్తి, బలం నేపథ్యంలో అత్యున్నత యాక్షన్ ఎలిమెంట్స్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' లో భాగంగా వస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంతో పాటు వామికా గబ్బీ చేతిలో రాజ్ కుమార్ రావుతో 'ప్రహార్', అడివి శేష్ తో 'గూఢచారి 2', సిద్ధాంత్ చతుర్వేదితో 'దిల్ కా దర్వాజా ఖోల్ నా డార్లింగ్' వంటి పలు క్రేజీ ప్రాజెక్ట్ లు లైన్ లో ఉన్నాయి.

# 'రంభ, ఊర్వశి, మేనక' ట్రైలర్ రిలీజ్..

అల్లరి నరేష్.. టాలీవుడ్ ఇండస్ట్రీలో ఓ మార్క్ హీరోగా ఎదిగాడు. కామెడీ కింగ్ గా ఎదిగిన అల్లరి నరేష్.. అప్పట్లో అందరిని కడుపుబ్బా నవ్వించేవాడు. ఈ మధ్యకాలంలో రూట్ మార్చిన నరేష్... సెంటిమెంట్ మూవీలతో కూడా అందరికీ కన్నీళ్లు తెప్పిస్తున్నాడు. ఇలా రెండు యాంగిల్స్ లో దూసుకు వెళ్తున్న అల్లరోడు... మళ్లీ జనాలను కడుపుబ్బా నవ్వించేందుకు సిద్ధమయ్యాడు. అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సినిమా 'రంభ, ఊర్వశి, మేనక' . చంద్రమోహన్ చింతాడ దర్శకత్వంలో వస్తున్న ఈ



సినిమాలో ఏకంగా ముగ్గురు హీరోయిన్లు సందడి చేయనున్నారు.

వచ్చే నెలలో రిలీజ్ కాబోతున్న ఈ సినిమా టీజర్ ను తాజాగా రిలీజ్ చేసింది చిత్రం బృందం. ఇందులో అల్లరి నరేష్ చేసిన కామెడీ అందరినీ ఆకట్టుకుంది.

# ఇండస్ట్రీలో ఎదగాలంటే సొంత ఇమేజ్ చాలా ముఖ్యం.. : రెజీనా



తెలుగు, తమిళ, హిందీ భాషల్లో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంతెడ్ బ్యూటీ రెజీనా కాసాండ్రా. ఇటీవల 'మరీచిక' అనే క్రైమ్ మిస్టరీ థ్రిల్లర్తో ఆకట్టుకున్న ఈ భామ, త్వరలో 'సెక్షన్-108', చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రెజీనా, తన కెరీర్ తొలిరోజుల్లో అనుభవించిన కొన్ని విచిత్రమైన, మరచిపోలేని సంఘటనలను పంచుకున్నారు. తన మొదటి తెలుగు చిత్రం 'శివ మనసులో శ్రుతి' (2012) సమయానికి నటన గురించి, ఇండస్ట్రీ రూల్స్ గురించి తనకు ఏమీ తెలియదని రెజీనా చెప్పారు. 'ఆ సమయంలో షూటింగ్ కోసం స్కూల్ కు వారాల తరబడి సెలవులు పెట్టాల్సి వచ్చేది. నా పాఠాలు మిస్ కాకుండా మా అమ్మ సెట్ లోనే కూర్చుని నా కోసం నోట్స్ రాసేది. ప్రొడక్షన్ ఫుడ్ కాకుండా బయటి నుంచి ఫుడ్ ఆర్డర్ చేసుకోవచ్చని మేకప్ ఆర్టిస్ట్ చెప్పినా పర్వాలేదని అవే తినేదాన్ని' అని గుర్తుచేసుకున్నారు. అలాగే ఒకసారి రేడియో మిర్చి ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు సాధారణ సల్వార్, జీన్స్ వేసుకుని, తల కూడా సరిగ్గా ఆరబెట్టుకోకుండా వెళ్లానని, అక్కడ ఫోటోలు తీసి వెబ్ సైట్ లో పెట్టేసరికి చాలా డల్లుగా కనిపించానని నవ్వుతూ చెప్పారు. ఆ తర్వాతే ఒక నటిగా సొంత టీమ్ ను, ఒక ప్రత్యేక ఇమేజ్ ను ఏర్పాటు చేసుకోవడం ఎంత ముఖ్యమో అర్థమైందని తెలిపారు. ఈ రోజుల్లో చూస్తున్న పర్సెప్షన్ ఇంజనీరింగ్ లాంటిది కాకపోయినా, మంచి పాత్రలు రావాలన్నా, కెరీర్లో ఎదగాలన్నా సమాజంలో మన గురించి ఒక మంచి ఇమేజ్ ఉండటం అవసరమని ఆ అనుభవాల ద్వారా తెలుసుకున్నానని రెజీనా వెల్లడించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# జూ. ఎన్టీఆర్‌కు సర్జరీ



మరో టాలీవుడ్ స్టార్ హీరోకి గాయం కావడంతో సినీ ప్రియులు, అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గ్లోబల్ స్టార్ జూనియర్ ఎన్టీఆర్ తీవ్ర భుజం నొప్పితో బాధపడుతుండటంతో, బుధవారం హైదరాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి సర్జరీ జరగనుంది. గతకొన్ని రోజులుగా భుజం నొప్పితో బాధపడుతున్న ఎన్టీఆర్.. వైద్యుల సూచన మేరకు షూటింగ్ లకు విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఆయన స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న 'డ్రాగన్' (వర్కింగ్ టైటిల్) చిత్రంలో నటిస్తున్నారు. ఈ సర్జరీ అనంతరం ఆయన కొద్దిరోజుల పాటు విశ్రాంతి తీసుకోనుండటంతో, తదుపరి షూటింగ్ షెడ్యూల్ కాస్త ఆలస్యమయ్యే అవకాశముంది.

# ఆర్జీవీ ఈజ్ బ్యాక్.. ముంబై మాఫియాపై భారీ చిత్రం ప్రకటన

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ (ఆర్జీవీ) మళ్లీ తన మార్క్ సబ్జెక్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. తనకు ఎంతో ఇష్టమైన ముంబై అండర్ వరల్ గ్యాంగ్స్టర్ల నేపథ్యంలో 'పోలీస్ కంపెనీ' పేరుతో ఓ కొత్త చిత్రాన్ని ప్రకటించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ 'టీ-సిరీస్' నిర్మిస్తున్న ఈ సినిమాలో టాలెంటెడ్ యాక్టర్ హర్షవర్ధన్ రాణే ప్రధాన పాత్రలో నటించనున్నారు. 1990ల చివర్లో, 2000వ దశకం ప్రారంభంలో ముంబైలో పెరిగిపోతున్న గ్యాంగ్ వార్లను అరికట్టడానికి అప్పటి ప్రభుత్వం ఒక ప్రత్యేక పోలీస్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసింది. ఆ స్క్వాడ్ స్ఫూర్తితోనే ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు ఆర్జీవీ వెల్లడించారు. ఈ స్క్వాడ్లోని కీలక సభ్యుడైన ప్రముఖ ఎన్ కౌంటర్ స్పెషలిస్ట్, పోలీస్ ఆఫీసర్ 'దయా నాయక్' పాత్రలో హర్షవర్ధన్ రాణే కనిపించనున్నారు. 'డీ-కంపెనీ కంటే ఇది చాలా ప్రమాదకరమైనది' అనే ట్యాగ్ లైన్ తో ఈ చిత్రం రాబోతోంది. హర్షవర్ధన్ రాణే లుక్ ను కూడా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పంచుకున్నారు.

ఈ సినిమా కథ నేపథ్యం గురించి వర్మ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వివరించారు. 'తన ప్రత్యర్థి గ్యాంగ్ వార్ లను దారుణంగా అంతం చేసిన తర్వాత దావూద్ ఇబ్రహీం.. తన గ్యాంగ్ను ఒక 'కంపెనీ'గా మార్చాడు. కార్యకలాపాల బాధ్యతలను తన అనుచరుడు ఛోటా రాజన్ కు అప్పగించి దుబాయ్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల దావూద్, రాజన్ ల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో ముంబై అండర్ వరల్ లో ఆధిపత్య పోరు మొదలైంది' అని వర్మ పేర్కొన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆధిపత్యం కోసం అనేక ఇతర గ్యాంగ్ లు రంగంలోకి దిగాయని, యూపీ, మధ్యప్రదేశ్, బిహార్ వంటి ప్రాంతాల నుంచి యువకులు అండర్ వరల్ కంపెనీల్లో చేరారని తెలిపారు. ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం ఒక స్పెషల్ స్క్వాడ్ ను ఏర్పాటు చేసిందని, 1997 నుంచి 2004 మధ్య కాలంలో ఈ స్క్వాడ్ దాదాపు 300 మందికి పైగా గ్యాంగ్ స్టర్లను హతమార్చిందని ఆయన వివరించారు. ఒకప్పుడు క్రైమ్, మాఫియా సినిమాలతో ట్రెండ్ సెట్ చేసిన ఆర్జీవీ.. మళ్లీ తనకిష్టమైన కథతో రావడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలోని మిగతా నటీనటుల వివరాలను మేకర్స్ త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా, ఆర్జీవీ ప్రస్తుతం 'పోలీస్ స్టేషన్ లో భూత్' అనే మరో హారర్-కామెడీ చిత్రాన్ని కూడా తెరకెక్కిస్తున్నారు.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.